
శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు



శ్రీ శ్రీ శ్రీ అవధూతేంద్ర స్వామి సమాధి (జ్ఞాన) మందిర్
పాత బస్టాండు ప్రక్కన, కడప – 516001

శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు

మొదటి ముద్రణ :2012 2000 కాఫీలు
రెండవ ముద్రణ :2026 500 కాఫీలు



అంకితం : శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి పాదపద్మములకు

పర్యవేక్షణ : శ్రీ పెసల సుబ్బరామయ్య

సేకరణ: ప్రసాద్

ప్రకాశకులు : శ్రీసాయి మాస్టర్ సేవాట్రస్ట్
గొలగమూడి (వయా) సర్వేపల్లి నెల్లూరు జిల్లా (A.P) PIN- 524321

ఓం శ్రీ అవధూతేంద్రాయ నమః

శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు

అధ్యాయము - 1

శ్రీ స్వామి వారి జీవితం

దాదాపు 40 సంవత్సరాలపాటు ఎవరినీ దగ్గరకు చేరనీయకుండా, ఎవరైనా దగ్గరకొస్తే బిగ్గరగా "పో పో" అని గట్టిగా అరుస్తూ తరిమివేస్తూ. ఎవరితోను మాట్లాడటానికి ఇష్టపడక, తనకేమీ పట్టనట్లు, చూడటానికి పిచ్చివానిలాగా వుండి, మల మలలాడే ఎండలోనైనా, ఎంతటి వర్షంలోనైనా నడి రోడ్డుమీద ఇష్టమున్నంతసేపు హాయిగా పడుకుని వుండే ఒకాయనతో ఒకనాడు తువ్వపల్లి లక్ష్మీనరసమ్మ తనను ఒక త్రాగుబోతు చాలా అశ్లీలంగా తిడుతున్న తిట్లను తట్టుకోలేక నిస్సహాయంగా మనస్సులో విన్నవించుకున్న వెంటనే ఆయన లేచి ఆ త్రాగుబోతును తన్ని తరిమివేశారు.

మనస్సులో చెప్పుకున్న మాటలు తెలుసుకోగలిగిన ఆయన, దుష్ట శిక్షకుడు - శిష్ట రక్షకుడు అయిన ఆయన, బలిష్టమైన పొడుగాటి ఆజానుబాహువైన శరీరం, నల్లని శరీరపు రంగు, నెరిసిన తల వెంట్రుకలు, పలుచని నెరిసిన గడ్డము, విశాలమైన నుదురు, తీక్షణమైన కన్నులు కలిగి వున్న ఆయన ప్రవర్తన అతి సామాన్యుడిలా, ఒక్కొక్కప్పుడు పిచ్చివాడిలా వుండేది. ఆయనే (అవధూతేంద్ర) స్వామి అంటే నమ్మబుద్ధి కానట్లు వుండేది.

'వివేక చూడామణి'లో ఆదిశంకరులు జీవన్ముక్తులు గురించి వ్రాస్తూ 'బాలోన్మత్త పిశాచవత్' అని వర్ణించారు. అంటే జీవన్ముక్తులు పసిపిల్లలవలెను, ఉన్మత్తుల (పిచ్చివారు) వలెను, పిశాచములవలెను వుంటారని వారి భావం. అందువల్ల వారిని గుర్తుపట్టడం చాలా కష్టం. శిరిడీ సాయిబాబా శిరిడీ చేరిన కొత్తల్లో ఆయననెవరూ గుర్తు పట్టలేదు. అక్కల్కోట మహారాజ్ పసిపిల్లలవలె రాళ్ళతోను, మట్టితోనూ ఆడుకుంటుండేవారు. అవధూతేంద్రస్వామి కూడా

ఒకప్పుడు పిచ్చివాడిలాగా, మరొకప్పుడు దెయ్యం పట్టినవాడిలాగా కన్పించేవారు. అవధూతేంద్రస్వామి మురికి కాలువలోని నీరు త్రాగటం, స్నానం చేయటం, ఒక్కొక్కసారి అర్ధరాత్రి వేళ గొంతుకు కూర్చుని కళ్ళు మూసుకొని తన కణతలపై నెమ్మదిగా రాళ్ళతో కొట్టుకునేవారు, ఒక్కొక్కసారి నడిరోడ్డుమీద ఉగ్రనరసింహులై పిడికిలిని బిగించి, చేతులు గాలిలోకి విసురుతూ చిందులు వేస్తూ ఎవరినో బండబూతులు తిట్టేవారు.

శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టారు వ్రాసిన "నేను దర్శించిన మహాత్ములు - 2: అవధూత శ్రీ చీరాల స్వామి" గ్రంధంలో శ్రీ చీరాలస్వామి గురించి సిద్ధపురుషులు శ్రీ లలితానందులు వేటపాలెం వాస్తవ్యులు శ్రీ రాజుపాళెం రామచంద్రారావుగారితో "మీ ఊళ్ళో రోడ్డుమీద తిరుగుతూ వుండే బోదకాలు స్వామివారు చాలా గొప్పవారు. సిద్ధపురుషులు. ఆయనే ఆ ఊళ్ళో లేకపోతే ఆ ఊళ్ళో చాలామంది రోగాది బాధలతో అలమటించేవారు. ఆయన వల్లనే ఆ ఊరు అంతమాత్రంగా నిలిచింది" అని అన్నారు.

రమణ మహర్షి చెప్పినట్లు జ్ఞానిని మరొక జ్ఞాని మాత్రమే గుర్తు పట్టగలిగినట్లు అవధూతేంద్రస్వామి గొప్ప మహనీయులని మహనీయులైన సద్గురు శ్రీ దర్గాస్వామి, ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారుగారు, గోపాలపురం రామయ్యస్వామి గుర్తించి దర్శనం చేసుకున్నారు. అజ్ఞానంలో వున్న మనము అలాంటి మహనీయులని గుర్తించలేము. కానీ గుర్తించేందుకు మార్గము మహనీయులైన శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు చెప్పి వున్నారు. ఆ మార్గం:

1. ఎవరి సమక్షములో మన మనస్సు ప్రశాంతత నొంది కాలగతి తెలియకుండా పోతుందో అది సద్గురు సన్నిధి అని తెలుసుకోవాలి. ఇలాంటి అనుభవం తనకు కలిగినప్పటికీ ఆధ్యాత్మికత తెలియనివారు అది మహాత్ముని సన్నిధియని గుర్తించలేరు. అలాంటివారికొరకు మరొక చక్కని పరీక్ష చెప్పారు.

2. మనం మహనీయుడు అవునా కాదా అని పరీక్షించే వారి దగ్గర సాధారణంగా జరిగేందుకు వీలులేని ఒక అనుభవం జరుగవలెనని, ఆ అనుభవం ఇంత టైంలో జరగాలని, అలా అనుగ్రహించమని మనం మన నోటితో అడగకుండా మానసికంగా చెప్పుకొని వారి సన్నిధిలో కూర్చొనేది.

కూర్చున్నంతసేపు సాయినామం మానసికంగా జపిస్తూ ఉండు. మనం మానసికంగా చెప్పుకున్న టైం లోపలే ఆ అనుభవం జరిగితే వారు సిద్ధపురుషులని తెలుసుకొనేది.

3. మూడవ విషయం: నిజమయిన మహనీయులెవ్వరు కూడా తమ పూర్వ చరిత్ర వారి నోటివెంట బయటపెట్టుకోరు. సన్నిహితులైన భక్తులు మరలా మరలా అర్థించినప్పుడు "కక్కిన కూటికి ఆశ పడతామా?" అన్న సందర్భాలున్నాయి. షిరిడీ సాయి, అక్కల్కోట స్వామి వంటి మహనీయులైతే కొందరికి మాదిగవారమని, మరికొందరికి సత్ బ్రాహ్మణులమని, మరికొందరితో ఆ విషయం అడిగితే చెప్పుతో కొడతామని అన్నారు.

4. నాలుగవ లక్షణం: వారు భక్తులనుండి ఏమీ ఆశించరు. భక్తులమీద ఎనలేని ప్రేమను అనుక్షణం కురిపిస్తుంటారు. వారి అన్నపానీయాలు పోషణ, పాలన భగవంతుడే చూడాలి.

5. ఐదవ లక్షణం: కరచాలనంతో వస్తువులను సృష్టించరు. అలా సృష్టించి ప్రజలను భ్రమకొల్పేవారిని మనం దర్శించనక్కరలేదు..

6. ఆరవ లక్షణం: మనకేదైన ఆపద రాబోతుంటే పరోక్షంగా మనలను హెచ్చరించి ఆ ఆపద రాకుండా చేస్తారు. వారి మాటలకు నిజమైన అర్థం మనకా ఆపద తప్పిపోయాక మనకు అర్థమౌతుంది.

ఎందరో భక్తుల అనుభవాలు! ఒక్కొక్క భక్తుని అనుభవాన్ని తరిచి చూస్తేగానీ తెలియదు స్వామివారి దివ్యత్వము, దాని వెనుక పైకి కనపడని, ఏ మాత్రం గుర్తింపు పొందాలనే కోరిక కూడా లేని అపారమైన కరుణ, ప్రేమ!

ఎప్పుడు స్వామి కడపకు వచ్చారో తెలియదు గానీ కొందరు 1938-39 ప్రాంతంలో స్వామివారిని చూచినట్లుగా చెపుతారు. స్వామి పుట్టుపూర్వోత్తరాల గురించి ఏమీ తెలియదు కానీ ఒకటి, రెండు కథనాలు వున్నాయి. ఆచార్య శ్రీ భరద్వాజగారు ఏనాడూ ఏ మహనీయుని పుట్టుపూర్వోత్తరాల గురించి ఎక్కువ విచారణ అవసరం లేదని సత్సంగాల్లో చెప్పటం వల్ల స్వామి తల్లిదండ్రులు ఎవరో, అయోనిజుడా కాదా, ఏ మతం వాడు అనేవి ఈ గ్రంథములో ప్రస్తావించటం లేదు.

మొదట్లో భిక్షకుడనుకుని రాగి నాణెములు స్వామికి సమర్పిస్తే వాటిని

తీసుకొని ఒక దుకాణంలో పప్పులు, బొరుగులు పైన విసిరేసేవారు. ఆ దుకాణదారుడు స్వామివారి దోసిలిలోకి పప్పులూ బొరుగులు పోసేవాడు. స్వామి వాటిని ఆరగిస్తూ నడచి వెళ్ళేవారు. ఆహారం కోసం ఎవరినీ అడిగేవారు కాదు. భక్తులు ఎవరైనా ఇస్తే తనకిష్టమైతే తీసుకునేవారు లేకపోతే లేదు. ఎవరితోనూ మాట్లాడటానికి ఇచ్చగించేవారు కాదు. ఒకవేళ మాట్లాడినా ఒకటి, రెండు మాటలు మాత్రమే! ఎవరైనా దగ్గరకొస్తే బిగ్గరగా "పో పో" అని గట్టిగా అరుస్తూ తరిమివేసేవారు. ఎవరైనా స్వామి ధ్యానమగ్నులైనప్పుడు మాత్రమే దగ్గరకు వెళ్ళే సాహసం చేసేవారు.

మురికినీటిమయమైన బుగ్గవంక దాని చుట్టుప్రక్కలవారికి మరుగుదొడ్లుగా వుపయోగపడేది. కానీ స్వామివారు దానిలోనే స్నానం చేసేవారు. ఆ నీటినే త్రాగేవారు. కానీ ఏనాడు స్వామి దగ్గర మురికి వాసన వుండేది కాదు. ఒకనాడు పాలమ్ముకునే ఒక స్త్రీ బుగ్గవంక మురికినీటిలో స్వామి స్నానం చేస్తుండటం చూసి స్వామి దగ్గర దుర్గంధం రాదా అని అనుకుంటూ ఊరిలోకి వెళ్ళి తన పాలవ్యాపారం పూర్తి చేసుకుని వస్తూ తాలూకాఫీసు వద్ద పడుకున్న స్వామి దగ్గరకి వచ్చి వాసన చూసింది. ఆశ్చర్యంగా ఏ మురికి వాసన లేకపోవటమేగాక వింత పరిమళపు వాసన వచ్చింది. స్వామి దివ్యత్వం తెలిసి స్వామి పాదాలకు నమస్కరించగానే స్వామి తన పాదాలతో ఆమెను ఒక తన్ను తన్నారు. ఆనాటి నుండీ ఆమెకున్న ఉబ్బసపు వ్యాధి నిర్మూలనమైంది.

స్వామికి ఒక నిర్దుష్టమైన దినచర్య ఏమీ వుండేది కాదు. మునిసిపల్ మార్కెట్టు, తాలూకాఫీసు, వన్ టౌను పోలీసు స్టేషను, ఫైరు స్టేషనులలో ఎక్కువగా వుండేవారు. కడపలో ఏ రోడ్డయినా స్వామికి పాన్పే. రోజులో ఏ సమయంలోనైనా, ఎంతటి రద్దీగా వున్నా పెద్ద పెద్ద వాహనాలు సైతం స్వామిని తప్పుకొని వెళ్ళవలసినదే. రోహిణీకార్తె ఎండలో కూడా మలమలా మాడిపోతున్న తారురోడ్డుపై కేవలం కౌపీనము మాత్రమే వుంచుకున్న స్వామి హాయిగా విశ్రాంతి తీసుకునేవారు. ఒకనాడు ఒక లారీ చాలా వేగంగా స్వామి తొడ మీద నుండి వెళ్ళినా స్వామికి కొంచెం కూడా గాయం అవలేదు.

1955 నుండి 1978 వరకు స్వామిసేవ చేసుకున్న రెడ్డయ్య చెప్పిన

ప్రకారం సుమారు 30 సం॥లు అవధూతేంద్రస్వామి గోళ్ళు, గడ్డము, తలవెంట్రుకలు తాను చూచిన నాటినుండీ స్వామి సమాధి అయ్యేవరకు పెరుగుదల లేకుండా వున్నాయి.

స్వామి ఎవరితోను పట్టనట్లుగా వున్నా ఆయన ప్రేమను వివిధ రకాలుగా ప్రకటించేవారు. స్వామివారి సర్వజ్ఞత్వం, సర్వవ్యాపకత్వం, సర్వసమర్థత్వం అటువంటి లీలలద్వారా ప్రకటమయ్యేవి.

ఓం శ్రీ అవధూతేంద్రాయ నమః

శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు

అధ్యాయము – 2

సర్వజ్ఞమూర్తి

సాధన ద్వారా సద్గురు కృపను పొంది, వారి అనుగ్రహం వలన ఆత్మజ్ఞానం పొందిన మహనీయులే సిద్ధ పురుషులు. శాస్త్రాలలో భగవంతునకు చెప్పబడ్డ సర్వజ్ఞత్వం, సర్వసమర్థత, సర్వ వ్యాపకత్వం అట్టివారిలో సంపూర్ణంగా ప్రకటమవడం భక్తులకు అనుభవైకవేద్యము. ఇట్టి మహనీయులు ప్రపంచంలో ఎక్కడ ఏమి జరుగుతున్నదో అనుక్షణము తెలుసుకుంటూ అద్భుతరీతిన తమ భక్తులను అనేక సంకటముల నుండి రక్షిస్తుంటారు. ఈ అధ్యాయంలో శ్రీస్వామివారి యొక్క సర్వజ్ఞత్వం, సర్వసమర్థత్వం చూస్తాము.

ఒకనాటి ఉదయం దీన్ సాహెబ్ హోటల్లో క్రిందటి రాత్రి తీసుకున్న 20 శేర్లు పాలను మరగ పెడుతున్నారు. స్వామివారు సరాసరి పాల పాత్ర వద్దకు వచ్చి ఒక్క ఉదుటున కాలితో పాత్రను దొర్లించి వేశారు. 20 శేర్లు పాలు నేలపాలయ్యాయి. స్వామిని పిచ్చివాడిగా అనుకొనేవారు తూలనాడారు. ఆ పాలపాత్రను లేవనెత్తుతుంటే పాలల్లో చచ్చి పడి ఉన్న 'పందికొక్కు'

కనపడింది. అప్పుడు అందరూ స్వామి సర్వజ్ఞత్వానికి అబ్బురపడ్డారు. ఆ విషతుల్యమైన పాలను త్రాగి ఎందరు రోగగ్రస్థులు అవ్వాలో కానీ అలా కానివ్వకుండా స్వామి రక్షించి తమ ప్రేమను వ్యక్తం చేశారు.

సన్నగా చినుకులు పడుతున్న ఒక సాయంత్రము బుగ్గవంక వద్ద లఘుశంక తీర్చుకుని హోటలులోకి వచ్చిన దీనాసాహెబ్ స్వామికి టీ ఇవ్వబోతే చెంపమీద గట్టిగా చరిచారు. ఒక్క ఉదుటున దీనాసాహెబ్ హోటల్ బయటపడ్డాడు. పైకి లేచేసరికి కడప పాతబస్టాండును ముంచివేస్తూ శరవేగంగా తన హోటలు వైపుకు వస్తున్న బుగ్గవంకను చూసేసరికి ఎన్నడూ కొట్టని స్వామి ఎందుకు కొట్టారో అర్థమవటమేగాక, స్వామి దయవలన తక్షణ కర్తవ్యం బోధపడి ఒక్క పరుగున గల్లాపెట్టెలోని డబ్బును ఒక తువ్వాలులోకి తీసుకొని, ప్రక్కనే వున్న రేడియోను చంకలో పెట్టుకుని సురక్షిత ప్రాంతానికి వెళ్ళగలిగాడు. కొంతసేపటికి మరలా హోటల్ దగ్గరకి వచ్చేసరికి కంఠం లోతు నీటిలో స్వామి అలాగే నిలబడి వున్నారు. ఎంత ప్రార్థించినా స్వామి రాకుండా అలాగే చాలాసేపు నిలబడ్డారు. నీళ్ళపాలు కావలసిన దీనాసాహెబ్ వ్యాపారాన్ని కాపాడటానికే అలా వున్నట్లు అనిపిస్తోంది. ప్రశాంతంగా వున్న బుగ్గవంక వాగులో ఎప్పుడు వరద వచ్చేదీ స్వామికి తెలుసు!

ఒకనాటి సాయంత్రము గుండయ్య, ఎరికలరెడ్డి, మరో ఇద్దరు మిత్రులు తాలూకాఫీసు వద్ద వున్న స్వామిని దర్శించినప్పుడు స్వామి వారితో “అట్లాపో” అంటూ ఏడురోడ్ల కూడలి వైపు చూపారు. గుండయ్య తన మిత్రులను స్వామి చెప్పినవైపు పంపించి పాతబస్టాండు దగ్గర పూలు కొనుక్కొని ఇంటికి వెళదామని బయలుదేరాడు. స్వామివారు “ఏయ్! అట్లాపో” అని గట్టిగా అరిచారు. స్వామి మాట కాదనలేక ఏడురోడ్ల కూడలివైపు నడుస్తున్నాడు. చాలా కొద్దిసేపటికే పాతబస్టాండు వైపునుండి ప్రజలు వెర్రిగా కేకలు పెడుతూ, భయభ్రాంతులై ఆత్మరక్షణ కోసం పరిగెత్తి వస్తున్నారు. వారి వెనుక లాఠీలతోను, తుపాకులతోను పోలీసులు తరుముకు వస్తున్నారు. (ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో భాగంగా ఆంధ్ర నాయకుల పిలుపునందుకొని వేలాది ప్రజలు ఎన్.జి.వో గృహం వద్ద సమావేశమయ్యారు. కీడు శంకించిన కేంద్ర రక్షకభటులు ప్రజలపై కాల్పులు

జరిపారు. అమాయకులైన కొందరు ప్రాణాలు కోల్పోయారు). ప్రాణభీతితో పరిగెత్తి వస్తున్న ఆ జనవాహినిని చూచి స్వామి తనను ఎందుకు ఆ వైపు వెళ్ళద్దన్నారో అర్థం చేసుకున్నాడు గుండయ్య. స్వామికి ఇలా ఉద్యమంలో ఎక్కడ కాల్పులు జరుపుతారనేది తెలుసు. అందుకే తనను నమ్మి సేవించే గుండయ్యను హెచ్చరించి ప్రాణభిక్ష పెట్టారు.

కర్నాట నారాయణరెడ్డి కడపలోని ఒక చలనచిత్ర సంస్థలో రిప్రజెంటేటివ్ గా పని చేసేవాడు. ఉద్యోగరీత్యా వివిధ పట్టణాలకు వెళ్ళి తమ చిత్రములు ప్రదర్శించువారి వద్ద నుండి రావలసిన పైకమును వసూలు చేసుకుని వచ్చేవాడు. ఒకనాటి రాత్రి పులివెందుల నుండి 3000/- రూపాయలు వసూలు చేసుకుని వచ్చాడు. ఆ పైకము కడప కృష్ణా థియేటర్లోని ఆఫీసులో జమ చేద్దామని వెడుతుండగా తాలూకా కార్యాలయం వద్ద స్వామి దర్శనం అయ్యింది. అతనిని స్వామి చుట్ట తెమ్మని సంజ్ఞ చేసారు. నారాయణరెడ్డి దగ్గర చిల్లర లేకపోవటం వలన దాదాపు ముప్పావు గంట తర్వాత చుట్ట తీసుకుని వచ్చాడు. ఆలస్యమైందని చింతిస్తూ స్వామి దగ్గరకు వెళ్ళగలిగే ధైర్యం లేక నిలబడి పోయాడు. స్వామి అతనిని చుట్ట అడిగి తీసుకున్నారు. తర్వాత స్వామి పాదసేవ చేసుకునే భాగ్యం కలిగింది. రాత్రి 11 గంటలకు స్వామి దగ్గర సెలవు తీసుకుని ఆఫీసుకు బయలుదేరాడు. స్వామి అతని వద్దకు పరిగెత్తుకుని వచ్చి అతనిని ఒక వైపుకు నెట్టారు. నారాయణరెడ్డి స్వామి త్రోసిన వైపుకు నడవటం మొదలు పెట్టాడు. కొంతదూరం వెళ్ళాడో లేదో స్వామి మరలా అతని దగ్గరకు వచ్చి మరియొకవైపుకు త్రోసారు. స్వామివారి ఉద్దేశ్యం అర్థంకాక, ఆ రాత్రికి ఎక్కడైనా పడుకుని తెల్లవారి ఆఫీసుకు వెళదామని దగ్గరలో వున్న లాడ్జిలో ఆ రాత్రి గడిపాడు. ఉదయం ఆఫీసుకు వెళితే అక్కడ యజమాని నారాయణరెడ్డిని 'రాత్రి రావలసినది కదా! ఎందుకు రాలేదు?' అని అడిగితే జరిగిన విషయం చెప్పాడు. అంతటితో ఆ యజమాని 'రాత్రి మన ఆఫీసులో దొంగలు పడి కావలివాడిని పొడిచి డబ్బును దొంగిలించారు. రాత్రి ఇక్కడకు స్వామి నిన్ను రానీయకుండా వున్నందుకు నీకేమీ ప్రమాదం కాలేదు. స్వామి మనకు మేలు చేసాడు" అని స్వామివారి సర్వజ్ఞత్వాన్ని, భక్తులమీద ప్రేమను కొనియాడాడు.

తెలుగు పండితులు శ్రీ పుట్టపర్తి నారాయణచార్యులవారి భార్య శ్రీమతి కనకమ్మ ఒకనాడు చిత్రాన్నమును స్వామికి తీసుకెళ్ళి సమర్పించింది. స్వామి పిడికెడు మాత్రం గ్రహించి ఆమె వచ్చిన వైపుకు కాకుండా మరియొకవైపుకు చూపిస్తూ "అట్లా పో!" అని చెప్పారు. స్వామివారి మాట అర్థంకాక వచ్చిన దారినే బయలుదేరింది. స్వామివారు ఆమె మెడపై చేయి వేసి అంతకు ముందు చూపించిన వైపుకు త్రోసారు. ఆమె ఆ మార్గంలో వెళ్ళింది. తరువాత తెలిసిన విషయమేమంటే ఆమె ఇంటి నుండి స్వామి దగ్గరకి వచ్చిన మార్గంలో ఒక బస్సుప్రమాదం జరిగింది. స్వామి చెప్పినట్లు కాక వచ్చిన మార్గంలోనే వెళ్ళితే ప్రమాదం జరిగి వుండేది.

ప్రతిరోజులాగే కూరగాయలు అమ్ముకొనే ఒక గర్భిణి స్త్రీ పల్లె నుండి కడపకు వచ్చి స్వామి దర్శనం చేసుకుని పాదనమస్కారం చేసుకుంది. వెంటనే స్వామి కాలితో తన్నేసరికి ఆ స్త్రీ క్రిందపడింది. తమాయించుకొని లేచిన ఆ స్త్రీ కూరలమ్ముకోవటానికి బయలుదేరింది. స్వామి ఒకవైపు చూపిస్తూ "అట్లా పో!" అని కేకలేశారు. స్వామి మాటలు అర్థం కాక తన దారిన పోతున్న ఆమెతో దీనాహెబ్ 'స్వామి నిన్ను ఇంటికి వెళ్ళమని చెపుతున్నారమ్మా!' అని చెప్పి ప్రయాణపు ఖర్చులు ఇచ్చి పంపాడు. ఆమె ఇంటికి చేరిన కొద్ది సేపటికే సుఖప్రసవమై పండంటి బాబు పుట్టాడు.

అగ్నిమాపక కార్యాలయంలో పనిచేసే గోనె సిద్ధయ్యకు అడపాదడపా సుస్తీ చేసేది. ఒకనాటి రాత్రి అతని భార్యకు స్వప్నంలో స్వామి ఒక అబ్బాయికి చీటీ వ్రాసి ఇచ్చి మణి హోటల్కి వెళ్ళమని ఆదేశించారు. మరునాడు సిద్ధయ్యకు చెప్తే చీటీ వ్రాసిస్తున్నారంటే డాక్టరుకు చూపించమన్నట్లుగా స్ఫురించి డాక్టరు దగ్గరకు వెళ్ళి తన ఆరోగ్యం గురించి చెప్పాడు. డాక్టరు పరీక్ష చేసి క్షయవ్యాధి మొదటిదశలో వుందని నిర్ధారించి, మందులతో నయమవుతుందని ధైర్యం చెప్పి, మందులిచ్చాడు. ఆ మందులు తీసుకున్న తర్వాత క్షయవ్యాధి పూర్తిగా నిర్మూలించబడింది. ప్రార్థన లేకుండానే స్వామి తన భక్తుల గురించి ఎంత జాగ్రత్త తీసుకుంటున్నారో కదా!

స్వామికి సేవ చేసుకునే గోపాలపురం నివాసి నారాయణరెడ్డి పొలంలో ఆయిల్ ఇంజను పనిచేయటం మానేసింది. ఎందరిచేత రిపేరు చేయించినా

అది పని చేయలేదు. ఒకనాటి రాత్రి స్వప్నంలో స్వామి "ఇంజన్లో గాలి తీసి, నీరు పోస్తే సరిపోతుంది" అని చెప్పారు. తర్వాతరోజు స్వామి చెప్పినట్లు చేస్తే ఇంజను పనిచేయటం ప్రారంభించింది. ఏ ఇంజనుకు ఏమి చేస్తే బాగవుతుందో స్వామికి తెలుసు!

కొండపేట నివాసి పాలు సుబ్బారెడ్డి ఆస్థిని గ్రామపెద్దలు, ప్రభుత్వ అధికారులు బలవంతంగా బనాయించి పైకం కట్టడం లేదని ఆస్థిని వేలంకి పెట్టాలని కోర్టులో కేసు వేసారు. నిత్యకృత్యంగా స్వామిసేవకు వచ్చిన సుబ్బారెడ్డి మనస్సులో తన ఆస్థిమీద వేసిన కేసు గురించి ఆందోళన చెందుతున్నాడు. స్వామి సుబ్బారెడ్డి ఛాతీ మీద తన్నారు. ఈ సంఘటన జరిగిన కొద్దిరోజులకే సుబ్బారెడ్డి ఆస్థి మీద పెట్టిన కేసు కోర్టు తప్పుడు కేసు అని కొట్టివేసింది.

ఒకనాడు హరీంద్రనాథ్ అన్నయ్య రాయచోటిలో ఫైరు క్యాంపుకి వెళ్ళి రాత్రంతా అగ్నిని ఆర్పుతూ కడపకు తిరుగు ప్రయాణంలో గువ్వల చెరువు దగ్గర ఒక టీ బంకు దగ్గర ఆగి జేబులో ఒక్క పైసా లేదు కదా ఒక రూపాయి వున్నా తనతో పాటు వున్న ఆరుగురు స్నేహితులతో కలసి కాఫీ త్రాగే వాళ్ళము కదా అని మనస్సులో స్వామికి చెప్పుకొని వాపోయాడు. స్వామిని తలుచుకున్నాడో లేదో స్వామి భక్తుడు రామయ్య గంపెడు పూరీలు తీసుకొచ్చి పెట్టాడు. అవి తిన్న వారందరూ, తలుచుకోగానే వారి ఆకలి తీర్చినందుకు స్వామికి కృతజ్ఞతలు సమర్పించారు.

ప్రతినిత్యం స్వామి సేవ చేసుకోవటం రెడ్డయ్య నిత్యకృత్యం. ఒకసారి ఒక పని మీద ప్రక్క ఊరికి వెళ్ళి 4 రోజులు స్వామి దర్శనము, సేవ చేసుకోలేకపోయాడు. కడపకు రాగానే ఆత్రుతతో స్వామి కోసం అన్ని చోట్ల గాలించినా స్వామి దర్శనం కాలేదు. అప్పుడు ఆవేదనగా స్వామికి మనస్సులో ప్రార్థన చేసుకున్నాడు. దూడ అరుపు విని ఆవు పరిగెత్తుకొచ్చినట్లు సరిగ్గా అదే సమయాన తన భక్తుని కోసం స్వామి రెడ్డయ్యకు ఎదురు వచ్చి దర్శనమిచ్చారు.

పంచాయితీ సమితిలో మేనేజరుగా పనిచేసిన కస్తూరి కృష్ణమూర్తిగారికి ఒకనాటి రాత్రి స్వప్నములో స్వామి అతని శిరస్సుపై

హస్తముంచి ఆశీర్వదించారు. తెల్లవారి నిద్రలేచి చూస్తే స్వప్నములో స్వామివారు స్పృశించిన చోట పుష్పాకారములో గుర్తు ఏర్పడినది. ఆ గుర్తు అలాగే దాదాపు ఆ ఒక సంవత్సరంపాటు నిలిచింది. 4 జులై 1975న కృష్ణమూర్తికి స్వప్నదర్శనమిచ్చి మంత్రోపదేశం చేసారు.

చెన్నూరు నివాసి బాషా కడపలోని లక్ష్మణయ్యర్ హోటల్కు పాలు పోసేవాడు. స్వామివారి మహిమలు తెలిసిన బాషాకు కూడా స్వామి మీద పూజ్యభావం ఏర్పడింది. ఒకరోజు సరాసరి బాషా ఇంటికి స్వామి వెళ్ళారు. తన ఇల్లు ఎలా కనుగొన్నారో అని ఆశ్చర్యపోతూ స్వామివారిని ఇంట్లోకి ఆహ్వానించి ఉపచారాలు చేసాడు. ఒక గంటసేపు అక్కడ వుండి స్వామి వెళ్ళిపోయారు. ఆనాటి నుండి అతనికెంతో ఆర్థికంగా కలిసి వచ్చింది.

ఓం శ్రీ అవధూతేంద్రాయ నమః

శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు

అధ్యాయము – 3

సర్వసమర్థుడు

అజ్ఞానం వలన దేహ పరిమితమైన మనకు మన దేహంలోని అన్ని అవయవాలు, ఇంద్రియాలు కూడా మన అధీనంలో వుండవు. గురుకృప వలన దేహ భ్రాంతి నతిక్రమించిన శ్రీస్వామివారి వంటి జ్ఞానులు విశ్వమంతా తామేయై యుండడమేగాక పిపీలికాది బ్రహ్మపర్యంతం సర్వమూ తమ ఆధీనములో నుంచుకొనగలరు. కనుకనే వారవసరమని తలచినప్పుడు మన కర్మ సూత్రాలను గూడా సడలించి భక్తరక్షణ గావించగల సర్వసమర్థులైయుంటారు. అయితే అట్టివారి కృపను పొందే విధంగా మన జీవిత విధానం నడుపుకోవాలి. ఆ విధంగా జీవించిన ధన్య జీవులెందరో అట్టివారి కృపకు పాత్రులయ్యారు.

భగవంతుడు సంకల్పమాత్రాన కోరినచోట ప్రకటమవగలవాడనీ, చలనమే లేనివాడనీ, అంతటా నిండియున్నవాడని శాస్త్రాలు తెలుపుతున్నాయి. ఈ అధ్యాయంలోని స్వామి లీలలు ఎంతో చిత్రంగా వుండటమేగాక స్వామియొక్క గొప్పతనం అర్థమవుతుంది.

1954-56లో కడపలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతుండట వలన ఐ.పి. రామయ్యగారు స్వయంగా రాత్రులందు పోలీసుగస్తీని తనిఖీ చేస్తుండేవారు. స్వామి పోలీసుస్టేషన్ వద్దనే పడుకుని వుండటం వలన స్వామిని భిక్షకుడిగా మాత్రమే చూచేవారు కానీ స్వామి గొప్పతనం తెలియదు. ఒకనాటి రాత్రి 11 గంటలప్పుడు గస్తీకి బయలుదేరినప్పుడు స్వామి పోలీసుస్టేషన్ మెట్లమీద పడుకుని వున్నారు. పాతబస్టాండు వెనుక వున్న బుగ్గవంకలో దిగి మోకాళ్ళ లోతు నీటిలో పోలీసు అనుచరులతో అవతలి ఒడ్డునున్న తాటిపురం చేరుకుంటున్న రామయ్యగారికి ఒక దివ్యమైన తేజస్సు కనపడింది. ఆ వెలుగు ఏమిటో తెలుసుకుందామని ఆ వైపుకు నడుస్తుంటే ఆ వెలుగు క్రమంగా మరుగవుతోంది. రామయ్యగారు టార్చిలైటు వేసి చూస్తే ఆ వెలుగులో స్వామివారి శిరస్సు కనపడింది. కంఠం వరకూ నీటిలో కూర్చుని వున్నారు స్వామి. సందేహం లేదు. తాను పోలీసు స్టేషను నుండి బయటకు వచ్చినప్పుడు మెట్లవద్ద పడుకుని వున్న దిగంబర భిక్షకుడి ముఖమే. రామయ్యగారికి ఏమీ పాలుపోలేదు. వెంటనే వెనుదిరిగి పోలీసుస్టేషను వచ్చి చూస్తే స్వామి అలాగే మెట్లవద్దే పడుకుని వున్నారు. ఆనాటి నుండి స్వామివారిపై గురుత్వమేర్పడింది రామయ్యగారికి.

శ్రీ ఒకరోజు రాత్రి ఇంటిలో తలుపులు వేసుకుని నిద్రపోతున్న రామయ్యగారి గదిలోకి అవధూతేంద్రస్వామి వచ్చి, తట్టి నిద్దురలేపి, " మీ మేనమామకి అనారోగ్యంగా వుంది. వెంటనే బయలుదేరి ద్రోణాచలం వెళ్ళు" అని చెప్పి అంతర్ధానమయ్యారు. వెంటనే ట్యాక్సీ ఏర్పాటు చేసుకొని ద్రోణాచలం (కర్నూలు జిల్లా) లోని మేనమామ ఇంటికి వెళ్ళేసరికి అక్కడ శ్రీ స్వామివారు రామయ్య మేనమామకి చికిత్స చేస్తూ వున్నారు. ఈ అద్భుతాన్ని చూసిన రామయ్య 'స్వామీ! స్వామీ!' అంటూ ముందుకు వెళ్ళి స్వామివారి పాదాలపై వాలారు. స్వామి "భయపడవలసిన పని లేదు. మీ మేనమామకి

తిరిగి ఆరోగ్యం చేకూరుతుందని" రామయ్యకు చెప్పారు. రామయ్య స్వామి కోసమని పూలమాల తీసుకురమ్మని అక్కడున్న బంధువులలో ఒకరికి చెప్పారు. ఆ వ్యక్తి పూలమాల తెచ్చే లోపల స్వామి అదృశ్యమయ్యారు. ఎక్కడో ద్రోణాచలంలో ఏ భక్తుడి యొక్క బంధువులకు అనారోగ్యమో తెలుసు, ఆ విషయం ఆ భక్తుడికి చెప్పి పంపించటం, వారు డాక్టరు దగ్గరకి వెళ్ళక మునుపే డాక్టరుగా స్వామే వచ్చి చికిత్స చేసి స్వస్థుణ్ణి చేయటం అంటే స్వామి సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు అని తెలుస్తోంది.

స్వామికృప వుంటే ఎంతటి రక్షణో కదా! మనకి కావలసినవన్నీ స్వామే చేస్తారు. శిరిడీ సాయిబాబా చెప్పినట్లు "ఇచ్చిన పని కుణ్ణంగా చెయ్యి లేకుంటే ఒప్పుకోకు" మన కర్తవ్యాన్ని భగవంతుని సేవగా చేస్తే స్వామి తృప్తి చెంది తగిన అనుభవాలను ఇచ్చి మన విశ్వాసాన్ని దృఢపరుస్తారు.

ఒకనాడు స్వామి గురించి తెలియని జిల్లా కలెక్టర్ తన ఆఫీసు బయట వాహనంకి ఎదురుగా కూర్చుని వున్న స్వామివారిని తన బంట్రోతుల చేత ప్రక్కకు పంపించారు. బూతులు తిడుతూ లేచిన స్వామి ఒక ప్రక్కగా నిలబడ్డారు. కలెక్టర్ వాహనంలో ముఖద్వారం వద్దకు వచ్చేసరికి వాహనానికి అడ్డుగా స్వామి నిలబడి వున్నారు. అంతలోనే అక్కడకు ఎలా వచ్చారో అని అయోమయంలో వెనుకకు తిరిగి చూస్తే అక్కడ కూడా స్వామివారు నిలబడి వున్నారు. ఒకే సమయంలో రెండుచోట్ల దర్శనమిచ్చిన స్వామి గొప్పదనానికి ఆశ్చర్యచకితుడైన కలెక్టరు ఇక ముందు స్వామివారిని ఎవరూ ఆక్షేపించరాదని ఉత్తర్వు జారీ చేసినాడు.

దీన్ సాహెబ్ కడపలోనేగాక రాయచోటిలో కూడా ఒక హోటల్ వుండేది. రాయచోటిలో పాలు సరిగా లభించకపోవడంతో కడప నుండి పాలు సరఫరా చేసుకునేవాడు. ఒకనాటి ఉదయం 5 గంటలకి కడపలోని తన హోటల్ వద్ద నుండి బయలుదేరే ముందర అక్కడే వున్న స్వామికి సమర్పించుకున్నాడు. స్వామి వద్ద సెలవు తీసుకుని, పాల డబ్బాలను బస్సులో పెట్టుకుని బయలుదేరాడు. సుమారు 30 కి॥మీ॥ ల దూరంలో వున్న గువ్వల చెరువు ప్రాంతంలో రహదారి మీద నడచిపోతున్న స్వామివారు కనిపించేసరికి డ్రైవరును అడిగి బస్సు ఆపించి స్వామి వద్దకెళ్లి బస్సు ఎక్కమని అర్థించాడు.

స్వామి నిరాకరించి బస్సు ఎక్కకుండా నడిచి వెళ్ళిపోయారు. మరలా కొద్దిమైళ్ళ అవతల వడ్డెపల్లి వద్ద స్వామి మరలా కనపడ్డారు. బస్సును ఆపమంటే డ్రైవరు ఆపకుండా ఒక వంద గజాలు వెళ్ళాడో లేదో అకారణంగా బస్సు ఆగిపోయింది. అందరు ప్రయాణికులు చూస్తుండగా స్వామి బస్సు దాటి వెళ్ళారు. తర్వాత కొంతసేపటికి కేవలం స్వామికృప వలన మాత్రమే బస్సు బయలుదేరింది.

కడప నుండి గిద్దలూరు బస్సు డ్రైవరు బస్సు పైకి సామాన్లు ఎక్కించేవారికి సూచనలిస్తూ వెనక్కి నడుస్తున్నాడు. దీనాసాహెబ్ హోటల్ దగ్గర నేలపై కూర్చున్న స్వామివారికి డ్రైవరు కాళ్ళు తగిలాయి. స్వామివారు ఆగ్రహముతో "పో నీయమ్మ" అని తిట్టారు. స్వామికి మనస్సులో క్షమాపణలు చెప్పుకొని బస్సును బయలుదీరదేశాడు. అతనికి వనిపెంట దగ్గర, మల్లెపల్లి దగ్గర, పోరుమామిళ్ళ దగ్గర, గిద్దలూరు, తిరుగు ప్రయాణంలో మరలా మల్లెపల్లి దగ్గర స్వామివారు కనిపించారు. స్వామి కనపడినప్పుడల్లా డ్రైవరు బస్సు దిగి స్వామిని బస్సు ఎక్కమని ప్రాధేయపడినా స్వామి బస్సు ఎక్కలేదు. ఈ అద్భుతం దీనా సాహెబ్‌కి చెపుదామని కడపకు రాగానే హోటల్కి వెళ్ళేసరికి దీనాసాహెబ్ స్వామికి చుట్ట వెలిగిస్తూ కనపడ్డాడు. అంతటితో డ్రైవర్కి స్వామి ఏదైనా చేయగలవాడనీ, అన్ని చోట్లా వున్న వాడనే విశ్వాసం దృఢపడింది.

ఒకసారి ప్రొద్దుటూరు డి.ఎస్.పి తిరిపెంగారు తన కారులో మైదుకూరు వెళుతూ మధ్యదారిలో పల్లవోలు వద్ద స్వామి రహదారి మీద నడిచి వెళుతుండడం చూసి మైదుకూరులో ఆఫీసు పర్యవేక్షణ అయిన తర్వాత తిరుగు ప్రయాణంలో స్వామిని ఎక్కించుకుందామనుకున్నారు. మైదుకూరు వెళ్ళి పర్యవేక్షణ పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణంలో స్వామి కోసం చూస్తే స్వామి కనపడలేదు. ప్రొద్దుటూరులో డి.ఎస్.పిని ఇంటి దగ్గర దింపి డ్రైవరు బొల్లు సుబ్బయ్య 2 వ టౌను పోలీసుస్టేషన్కి వెళుతూ మధ్య దారిలో టీ స్టాలికి వెళ్ళాడు. స్వామి ప్రొద్దుటూరు బస్టాండ్ వైపు వెళ్ళుతూ కనపడ్డారు. వెంటనే టీ తీసుకొనీ వెళ్ళి ఇస్తే స్వామి త్రాగారు. స్వామివారు అంత వేగంగా ప్రొద్దుటూరు ఎలా చేరుకున్నారో బొల్లు సుబ్బయ్యకు చిక్కు ప్రశ్నగా నిలిచింది.

ఒకప్పుడు మునెయ్యతో పాటు కొంతమంది పోలీసు కానిస్టేబుళ్ళు కడప నుండి చెర్లోపల్లికి రిలీవర్లుగా పోతూ కడప ఏడు రోడ్ల కూడలి వద్ద మండుటెండలో వెల్లకిలా పడుకున్న స్వామికి నమస్కరించుకుని ప్రయాణం ప్రారంభించారు. మధ్యదారిలో పులివెందుల వద్ద స్వామి చేతులు ఊపుకుంటూ నడుస్తూ కనపడ్డారు. వారు వ్యాను దిగి స్వామిని వ్యాను ఎక్కమంటే ఎక్కలేదు. 'చెర్లోపల్లి చేరుకున్నాక స్వామివారు మరలా దర్శనమిచ్చారు.

1967లో జనరల్ ఎన్నికల పోలింగ్ అయ్యాక బ్యాలెట్ పెట్టెలను కడప తాలూకాఫీసులో ఉంచి పోలీసులు పహారా ఏర్పాటు చేసారు. స్వామివారు తాలూకాఫీసు వద్దే వున్నారు. భక్తులు స్వామిని అక్కడే దర్శించుకుని వెళ్ళుతున్నారు. ఒకనాటి రాత్రి 8 గంటలకి పోలీసు కానిస్టేబులు వెంకట రమణయ్య స్వామికి చుట్ట సమర్పిస్తే స్వామి స్వీకరించలేదు. తెల్లవారుజామున 3 గంటలకు తన డ్యూటీ పూర్తి చేసుకొని పాతబస్టాండు వద్ద ఒక షాపులో సోడా త్రాగుతూ షాపు ముందర గలీజుగా ఎందుకు వుంది అని షాపువాడిని అరిచాడు. ఆ షాపువాడు 'స్వామివారు అంతకు ముందే వచ్చి సోడాలు త్రాగి పుక్కిలించి ఉమ్మారు. అంతేకాక ఆకు, వక్కా నమిలి ఊశారు' అని చెప్పాడు. ఆ మాట విన్న రమణయ్యకు తనతో పాటే రాత్రంతా వున్న స్వామి అక్కడకి అదే రూపంలో వచ్చారని తెలిసి స్వామి మహత్మ్యం మనస్సుకు బాగా హత్తుకుంది.

ఉప్పరపల్లి హరిజన యువకుడు రోశయ్యకు బాగా త్రాగుడు అలవాటు. ఒకనాడు మద్యం సేవించి ప్రక్క గ్రామంలో వున్న బంధువుల ఇంటికి వెళ్ళుతూ రహదారిలో స్వామిని చూచి వినయంతో నమస్కరించాడు. స్వామి అతని చొక్కా పట్టుకుని లాగి చేతులు ముందుకు చూపి “ఫో!” అని గట్టిగా అరిచారు. ఆ రోజు నుండి అతనికి క్రమముగా త్రాగుడు అలవాటు పోయింది. సత్ప్రవర్తనతో జీవిస్తూ కొన్ని ఊళ్ళలో స్వయంగా సత్రాలు కట్టించాడు. మాటమాత్రం చేత త్రాగుడు లాంటి దురభ్యాసాన్ని పోగొట్టారంటే స్వామి సమర్థులని, పతిత పావనులని తెలుస్తోంది.

ఓం శ్రీ అవధూతేంద్రాయ నమః

శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు

అధ్యాయము – 4

ఆపద్బాంధవుడు

అజ్ఞానమనే కటిక చీకటిలో అహంకారమనే మొసళ్ళతో పోరాడే మనకు 'కర్మ దాటనెవరి తరము! నొసట వ్రాసిన బ్రహ్మరాత తప్పింప ఎవ్వరికీ శక్యముకాదు' అనే మెట్ట వేదాంతం బాగా వంటబట్టి మహనీయులెంతటి దయామయులో మనకు అనుభవం కాకుండా చేస్తుంది. పూర్వ పుణ్యం వలన సద్గురు కృపకు పాత్రులైన వారెంతటి చెడ్డ కర్మనైనా, ఎట్టి బ్రహ్మరాతనైనా సునాయాసంగా తప్పించుకొని గమ్యం చేరగలరని శ్రీస్వామివారు, శ్రీ శిరిడీ సాయి వంటి మహనీయుల చరిత్రలే గాక మన సమకాలికులైన సోదర భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నవి. సద్గురుకృప యనునది మనం ప్రార్థించిన సమయములలోనే గాదు మనం ఏమరుపాటుగా నున్నప్పుడు కూడా వెన్నంటి మనలను రక్షిస్తుందని ఈ క్రింది నిదర్శనములు తెలుపుచున్నవి.

ఆ పరమాత్మ యొక్క దివ్యశక్తే ఈ విశ్వంలో అన్ని రూపాలు ధరించింది. ఆ శక్తే మన శరీరంలో గూడా పనిచేస్తుంది. అది సక్రమంగా పనిచేస్తే మనము ఆరోగ్యంగా వుంటాము. మన పూర్వ కర్మలననుసరించి ఆ శక్తి మనలో అస్తవ్యస్తంగా పని చేస్తుంది. అదే రోగానికి కారణం. మహనీయులలో ఈ శక్తి వారి తపోప్రభావం వలన ఎంతో శక్తివంతంగా పనిచేస్తుంది. కనుకనే వారు తక్కిన ప్రకృతిని ఎంతో చిత్రంగా శాసించగల్గుతారు. దుస్సాధ్యమైన రోగాలను కూడా వారు నివారించగలరు. అట్టి సహాయాన్ని పొందిన ఆర్తులు వారి ఎడల కృతజ్ఞతా భావంతో భక్తి విశ్వాసాలను పెంపొందజేసుకొని ధర్మమార్గంలో నడుస్తారు. భగవంతుడు వున్నాడన్న విశ్వాసం పచ్చి లౌకికులైన మానవులకెలా గల్గుతుంది? అలాంటి

విశ్వాసాన్ని కల్గించి మానవాళిని ధర్మపథంలో నడిపించాలనే మహనీయుల తపనే ఇట్టి లీలలకు కారణము.

దోనెపర్తి నారాయణ శ్రేష్ఠికి కాళ్ళు, కీళ్ళు, శరీర అవయవములు ఏవీ కదలలేని పరిస్థితిలో వున్నాడు. ఆ జబ్బేమిటో డాక్టర్లకు కూడా అంతు బట్టలేదు. అతనిని రిక్షాలో స్వామి దర్శనానికి తీసుకువచ్చారు. కదలలేని నారాయణ శ్రేష్ఠి నిస్సహాయంగా స్వామిని చూస్తూ కళ్ళ వెంట కన్నీరు కారుస్తున్నాడు. దీనాసాహెబ్ హోటల్లో వున్న స్వామి లేచి చెంబుతో కుండలోని నీరు తీసుకొని కొన్ని త్రాగి, ఆ ఎంగిలి నీటిని నారాయణ శ్రేష్ఠిపై చల్లారు. కట్లు తెంచుకున్న కొదమసింహంలా నారాయణ శ్రేష్ఠి లేచి నిల్చున్నాడు. వెంటనే స్వామి పాదాలకు నమస్కరించాడు.

మణి హోటల్ యజమాని బాలయ్య స్వామిసేవకై కొంతకాలం పాటు ఒక అబ్బాయిని నియమించి స్వామికి ఆహారం సమర్పించేవాడు. ఆ పిల్లవాడి పని ఉదయం 9 గంటలకి ఆహారం తీసుకొని స్వామి వెంట తిరుగుతూ స్వామికి సమర్పించటం మరలా మధ్యాహ్నం 3 గంటలకి ఆహారం తీసుకెళ్ళి సమర్పించటం. ఒక్కొక్కసారి స్వామి కొంచెమే తిన్నప్పుడు మిగిలిన ఆహారాన్ని బాలయ్య కుటుంబము దాన్ని ప్రసాదంగా తీసుకునేవారు.

ఒకనాటి రాత్రి బాలయ్య మేడపై నుండి కాలుజారి క్రింద పడ్డాడు. తలకు బలమైన దెబ్బ తగిలి స్పృహ కోల్పోయాడు. మద్రాసు జనరల్ హాస్పిటల్లో నెల రోజులు పాటు స్పృహ లేకుండా వున్నాడు. స్వస్థులై కడపకు తిరిగి వచ్చాక తాలూకాఫీసు వద్ద వున్న స్వామి దర్శనం చేసుకున్నాడు. స్వామివారు అతని వంక చూసి నవ్వుతూ "నీవు ఎప్పుడో పోయేవాడివిరా, పో పో!" అన్నారు. నెలరోజులు స్పృహలేకుండా వున్న తాను స్వస్థుడవటం స్వామికృప వలనేనని తెలుసుకుని స్వామికి కృతజ్ఞతలు సమర్పించాడు.

దత్తాత్రేయ పరంపరలోని అవధూత సాంప్రదాయంలో రోగికి విషతుల్యమైన పదార్థములతో రోగము కుదర్చడమనేది ఒక దివ్యలీల. వారి యందు విశ్వాసముగల వారికది అమృతతుల్యమై ఆరోగ్యము చేకూరుస్తుంది. ఈ అవధూత సాంప్రదాయంలో మహనీయులైన శ్రీస్వామివారి భక్తుల విషయంలో ఇది అనుభవము.

కృష్ణప్పకి గుండె దగ్గర రూపాయి బిళ్ళ పరిమాణంలో అవరోధంగా వుండి గుండెనెవరో పిండినట్లుగా వుండి విపరీతమైన బాధగా వుండేది. దగ్గితే రక్తం పడేది. స్వామి మీద విశ్వాసం గల కృష్ణప్ప స్వామి త్రాగి పారవేసిన పొగాకు చుట్టలను ఏరుకుని త్రాగేవాడు. గుండెజబ్బు వ్యక్తికి పొగత్రాగటం ప్రాణాంతకం. కానీ స్వామి పవిత్ర స్పర్శతో పునీతమైన చుట్టలు త్రాగటం వలన కృష్ణప్పకి పూర్తి ఆరోగ్యం చేకూరింది.

బూసం సుబ్బన్నగారు ఆంధ్రజ్యోతి పత్రికకు ఏజంటుగా పనిచేసే కాలంలో అతని ఎడమ చేయి చాలా బాధించేది. ఎన్నో మందులు వాడారు కానీ ఏమాత్రం నొప్పి తగ్గలేదు. వైద్యులకు వైద్యులైన స్వామిని దర్శించి పొగాకు చుట్ట సమర్పించబోగా “రేపు రా” అని అన్నారు స్వామి. తర్వాత రోజు కూడా స్వామి అతనితో "పో! మళ్ళీ రా పో!” అని అన్నారు. మూడవరోజు కూడా వచ్చి చుట్ట సమర్పించబోగా స్వామి బిగ్గరగా తిడుతూ "పో నీయమ్మ సొళ్ళ" అని ఎడమ చేతితో సుబ్బన్న ఎడమ భుజానికి, కంఠానికి మధ్య కొట్టారు. అంతే ఆ క్షణం నుండి అతని ఎడమ చేయి నొప్పి తగ్గింది.

పాలెం రెడ్డయ్యగారి కుమారుడు రామకృష్ణకు 12 ఏళ్ళ వయస్సులో జ్వరమొచ్చింది. స్వామివారి ఆశీస్సులకై లక్ష్మణయ్యర్ హోటల్ దగ్గరనున్న స్వామి దగ్గరకి వెళ్ళాడు. స్వామి ఆ బాలుడి రొమ్ముపై చేయి వేసి ఒక త్రోపు తోశారు. ఆ బాలుడు క్రింద పడ్డాడు. అంతటితో జ్వరం తగ్గిపోయింది.

సుబ్రహ్మణ్యం కడప ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగి. 1972లో అతని తండ్రికి గుండె జబ్బు చేయగా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఒకరోజు అర్ధరాత్రి వరకు తండ్రి దగ్గర వుండి ఇంటికి పోతూ తాలూకాఫీసు వద్ద స్వామివారిని దర్శించుకున్నాడు. స్వామి “రేపు రా” అని అన్నారు. ఎంతో సంతోషంతో ఉదయం 5 గంటలకే స్వామి దర్శనం చేసుకున్నాడు. స్వామి “చుట్ట తే పో!” అనగానే రెండు చుట్టలు తెచ్చి స్వామి ముందుంచారు. స్వామి ఒకటి తీసుకుని వెలిగించారు. నేలపై మాత్రం రెండు చుట్టలు అలాగే వున్నాయి! స్వామి "ఇక పో!” అని అన్నారు. స్వామి నుండి ఆశీర్వాదం ఆశిస్తున్న అతను అసహనంగా “ఉదయం రమ్మని చెప్పి, ఇలా పొమ్మంటారేమిటి స్వామి?” అని పైకి అన్నాడు. చుట్టుప్రక్కల వారు

'స్వామివారితో అలా అనకూడదు. మంచే జరుగుతుంది పోండి' అని చెప్పారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గం॥ 30 ని॥ల ప్రాంతంలో వాళ్ళ నాన్నగారిని ఆరోగ్యం బాగుందని డిశ్చార్జ్ చేశారు. అదే రోజు సాయంత్రం వాళ్ళావిడకి సుఖప్రసవమై మగబిడ్డ కలిగాడు.

ఒకనాటి మధ్యాహ్నం కుటుంబ సమస్యలతో మునిగిపోతున్న పెద్దమునెయ్య తాలూకా కార్యాలయం రహదారిపై పడుకుని వున్న స్వామి దర్శనం చేసుకున్నాడు. ఎలాగైనా స్వామి ఆశీస్సులు పొందాలని అక్కడే వున్నాడు. కొంతసేపటికి స్వామి లేచి అగ్నిమాపక కార్యాలయం దగ్గర వున్న చెట్టు నీడకి వెళ్ళి విశ్రమించారు. మునెయ్య స్వామిని వెంబడిస్తూ వెళ్ళాడు. స్వామి ఆశీస్సుల కోసం ఎదురు చూస్తున్నాడు. కొంతసేపటి తర్వాత స్వామి లేస్తూ "హూ! గట్టెక్కినావు ఫో!" అంటూ స్వామి లేచారు. స్వామివారి ఆశీర్వాదబలంతో మునెయ్య కుటుంబ పరిస్థితులు చక్కబడ్డాయి.

బట్టల దుకాణంలో పనిచేసే పోసా సుబ్బరాయుడికి స్వామి ఎడల భక్తి విశ్వాసాలు కలిగి వుండేవాడు. స్వామి దర్శనం చేసుకొని మనస్సులోనే కోర్టులో నడుస్తున్న వ్యాజ్యంలో గెలిచేటట్లు చేయమని కోరుకున్నాడు. వెంటనే స్వామి తన కాలితో అతని వీపుపై కొట్టేసరికి సుబ్బరాయుడు క్రిందపడ్డాడు. కోర్టు కేసులో గెలిచాడు.

ఒక రెడ్డిగారు ఖూనీ కేసులో ఇరుక్కున్నాడు. ఆయనపై చాలా బలమైన ఆరోపణలు వున్నాయి. కడప న్యాయస్థానంలో విచారణ జరుగుతున్నది. తీర్పు ఇవ్వవలసిన రోజు దగ్గర పడుతున్నది. వేరే దిక్కులేక స్వామివారిని ఆశ్రయించి స్వామివద్దే వుంటూ స్వామికి సపర్యలు చేస్తున్నాడు. ఒకనాడు ఆయనను వంగబెట్టి స్వామి పిడికిలి బిగించి గొడ్డును బాదినట్లు బాదారు. అయినా స్వామిని వదలక సేవిస్తున్నాడు. తీర్పు ఇవ్వవలసిన రోజు స్వామి ప్రసన్నంగా అతనితో "ఇట్లాపో" అంటూ రెడ్డికి దారి చూపించారు. అదేరోజు న్యాయస్థానంలో అతనికి శిక్ష తప్పింది. ఆనందం పట్టలేక స్వామి దగ్గరకు వచ్చి డబ్బులను స్వామి పాదాలపై కుమ్మరించాడు. స్వామివారు ఆగ్రహంతో "పో నీయమ్మ" అని బూతులు తిడుతూ ఆయనను పంపివేశారు. ఇలానే ఇంకొక భక్తుడు తన కోరిక తీరేందుకు స్వామిని ప్రసన్నం చేసుకోవటానికి

వంద రూపాయల నోట్లను ఉంచాడు. స్వామివారు బూతులతో అతనిని తరిమివేశారు.

హరీంద్రనాథ్, కడప: ఒకసారి ఆఫీసు తనిఖీ చేయటానికి వచ్చిన పై ఆఫీసరు నిష్కారణంగా 'ఆ వస్తువులు పోయాయి, ఈ వస్తువులు పోయాయి' అని, అది నా తప్పేనని ఒప్పుకోమని, అందుకు కాగితం మీద సంతకం చేయమని అంటున్నాడు. నాకు పాలుపోక స్వామి దర్శనం చేసుకొని ఆఫీసుకు వెళితే ఆ ఆఫీసరే అంతా బానే వుందని అన్నాడు. ఇంతలోనే అతని మనస్సు అంత మారటం ఎంత చిత్రమో కదా! ఓం సర్వప్రేరణాధికారిణే నమః

ప్రభుత్వ ఆసుపత్రిలో కంపౌండర్‌గా పనిచేస్తున్న కస్తూరి నరసింహయ్య 1953 ప్రాంతంలో సస్పెండ్ అయ్యాడు. బాధలకు లోనై స్వామిని దర్శించి చాలా కాలంపాటు స్వామి సేవ చేసుకున్నాడు. ఒకనాటి రాత్రి అతని స్వప్నంలో స్వామి దర్శనమిచ్చి నరసింహయ్యతో "భయపడవలసిన పని లేదు. నిన్ను తిరిగి పనిలో చేర్చుకుంటారు" అని ధైర్యం చెప్పారు. అదే విధంగా కొద్దికాలానికే అతనిని అధికారులు పనిలోనికి చేర్చుకున్నారు.

వాసుదేవరెడ్డి చాలా ఆస్థి నష్టపోయాడు. కష్టాలు భరించలేక తన ఆత్మబంధువైన స్వామి దగ్గరకు వచ్చి విన్నవించుకున్నాడు. రోజూ చుట్ట, అగ్గిపెట్టె స్వామికి సమర్పించే అతని దగ్గర ఆనాడు ఏదీ లేదు. స్వామి అతనిని దగ్గరకు రమ్మని పిలిచారు. చాలా చిత్రంగా అతని చేతిలో ఒక చుట్ట ప్రత్యక్షమైంది. అది స్వామి ప్రసాదంగా ఇంటికి పట్టుకెళ్ళి జాగ్రత్తగా ఉంచుకున్నాడు. ఆనాటి నుండి సర్వవిధాలా అభివృద్ధి చెందారు.

కడప జిల్లా లక్కిరెడ్డి పల్లె తాలూకా చిట్టూరు గ్రామ నివాసి వీరనాగయ్యకు ఉద్యోగం లేక అనేక ఆర్థిక ఇబ్బందులు పడ్డాడు. 1972లో స్వామి దర్శనం చేసుకొని కలెక్టరు ఆఫీసులో ఉద్యోగానికి పెట్టబోతున్న దరఖాస్తును స్వామి పాదాలకు తాకించి పంపించాడు. కలెక్టర్ శ్రీ చంద్రమౌళిగారు ప్రత్యేకంగా వీరనాగయ్యను పిలిపించి జమ్మలమడుగు బి.సి. హాస్టల్‌కు వార్డన్‌గా నియమించారు. అంతటితో వీరనాగయ్య ఇబ్బందులు సమసిపోయాయి.

ఓం శ్రీ అవధూతేంద్రాయ నమః

శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు

అధ్యాయము – 5

భూతనియంత

నిర్మలం, నిష్కలం, నిత్యం, నిర్వికల్పం, నిరంజనం అయినట్టి ఆ పరమాత్మ తాను అనేకమవ్వాలనే దివ్య సంకల్పంతో ధరించిన రూపమే ఈ స్థూలజగత్తు. మన శరీరం మనస్సుకధీనమైనట్లు, మన మనస్సు ఆత్మకధీనము. సద్గురువు త్రిమూర్త్యాత్మకుడైన సాక్షాత్తు పరబ్రహ్మమే గనుక ఈ విశ్వమంతా వారి అధీనమై ఉంటుంది. ఈ విషయం సద్గురువు ద్వారా ప్రకటమయ్యే దివ్యలీలల ద్వారా భక్తులకు తెలుస్తుంది. అనంతమైన ఈ ప్రకృతిని శాసించగల సద్గురువు సామర్థ్యమును చవిచూచిన భక్తులకు, గురువు యందు విశ్వాసం ధృఢపడి శ్రద్ధాభక్తులతో వారిని సేవించి తరించగలరు.

మన జీవిత సంఘటనలను శాసించగల దైవశక్తి ఒకటున్నదన్న విశ్వాసం మనకు కల్గించాలని, తద్వారా నిత్య జీవితములో వివేకము, వైరాగ్యము గల్గి ధార్మిక జీవితము త్రికరణ శుద్ధిగా మనచేత ఆచరింపజేయాలనే సద్గురుని యొక్క తపనే ఇట్టి లీలలకు మూలము.

వారు మన నుంచి ఆశించునది అట్టి పవిత్ర జీవన విధానమే. మనం అలా జీవించినప్పుడే మనం నిజంగా వారికి దక్షిణ సమర్పించిన వారమవుతాము. అలా చేయనప్పుడు లీలా రూపంలో మనపై వర్షించిన సద్గురుకృప అడవిగాచిన వెన్నెలవలె వ్యర్థమగును.

ఒకసారి కుంభవృష్టి వలన బుగ్గవంక వాగు ఉరవడితో పరవళ్ళు త్రొక్కుతున్నది. స్వామివారు దాని ఉధృతముతో తనకేమి పనిలేదు అన్నట్లు, నెమ్మదిగా నీటిలోకి దిగి అవతలి ఒడ్డునున్న తాటితోపు వైపుకు నడుస్తున్నారు.

స్వామివారు నీటిలో ఎంతదూరం నడిచినా మోకాలు దాటి నీరు పైకి రావటం లేదు. స్వామివారిని అనుసరిస్తూ వచ్చిన ముగ్గురు పోలీసులను (ఖాదర్ హుస్సేన్, అల్లాబఖసి, దస్తగిరి సాహెబ్) స్వామి తన వద్దకు రమ్మన్నారు. అప్పుడే చూసిన అద్భుతంతో, స్వామి మీద విశ్వాసంతో వాగులోకి దిగి నడుస్తుంటే వారికి నడుము లోతు మాత్రమే నీరు వుంది. తర్వాత వారు క్షేమంగా స్వస్థానాలు చేరుకున్నారు.

ఒకసారి పెద్ద వర్షం వలన వీధులలోని మురికి కాలువలు నిండిపోయి రోడ్లలో రెండు అడుగుల లోతు నీరు పారుతున్నాయి. రోడ్డు మీద పడుకున్న , స్వామి మీద నుండి అంత లోతు నీరు పారుతున్నా ఎంతోసేపటికి గానీ స్వామి లేవలేదు. ఒక నిమిషం పాటు నీళ్ళల్లో తలకాయ వుంటే శ్వాస తీసుకోలేక ఉక్కిరి బిక్కిరి అవుతాము. అలాంటిది స్వామికి ఏ మాత్రం ఇబ్బందీ కలగలేదు అంటే శ్వాస కూడా ఆయన సంకల్పానుసారంగా ప్రవర్తిస్తుందని తెలుస్తోంది.

మరియొకసారి బాగా వర్షం పడి రోడ్లలో నీరు బాగా ప్రవహిస్తున్నది. పడుకున్న స్వామివారి శిరస్సు వరకు వచ్చిన ఆ నీరు రెండుపాయలుగా చీలి ఆయన ప్రక్కల నుండి పారింది. స్వామి పడుకుని వున్న ప్రదేశం పొడిగానే వుంది.

ఒకసారి దీనాసాహెబ్ హోటల్లో సెగలు గ్రక్కుతున్న షేర్వా పాత్రను రెండు చేతులతో పైకెత్తి నోట్లో వేసుకున్నారు. సగం పాత్ర ఖాళీ అయ్యింది. స్వామికి అంత వేడి షేర్వాను తిన్నా ఏ మాత్రం కాలలేదు పైగా ముఖానికి కొంచెం చెమట కూడా పట్టలేదు.

స్వామి ఏనాడు ఈ కూర బాగుంది అని కానీ బాగోలేదు అని కానీ అని ఎరుగడు. ఒక్కొక్కసారి అదే పనిగా మిరపకాయ బజ్జీలలోని మిరపకాయలను మాత్రమే తినేవారు.

ఎంతో కాలంగా దెయ్యం పట్టిన ఒక స్త్రీని ఒకనాటి సాయంకాలం తాలూకాఫీసు ముఖద్వారం వద్ద కూర్చున్న స్వామి దగ్గరకి తెచ్చారు. స్వామి దగ్గరకు తీసుకు వస్తున్న కొద్దీ ఆ స్త్రీ గుండెలవిసేలా రోదిస్తూ మధ్యమధ్యలో తనను కొట్టవద్దనీ, బాధపెట్టవద్దనీ స్వామివారిని అర్థిస్తున్నది. గుమిగూడిన జనానికి విషయం అర్థంగాక అమోమయంగా చూస్తున్నారు. ఆ ఆర్తనాదాలు

ఎక్కువగా చేస్తూ శరీరాన్ని గుండ్రంగా తిప్పుతోంది. అందరివంకా అమాయకంగా చూస్తున్న స్వామి లేచి ఆ స్త్రీ వీపున చరిచారు. అంతే ఆనాటి నుండీ ఎంతో కాలంగా పట్టి పీడిస్తున్న దెయ్యం పీడ వదిలి, ఆ స్త్రీ స్వస్థురాలయ్యింది.

ఓం శ్రీ అవధూతేంద్రాయ నమః

శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు

అధ్యాయము – 6

యోగీశ్వరుడు

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు రచించిన శ్రీ సాయి లీలామృతములో వ్రాసినట్లు "శ్రీ రాముడు, శ్రీ కృష్ణుడు వంటి అవతారాలు దుష్టశిక్షణ చేస్తారు. శ్రీ దత్తాత్రేయుడు, శ్రీ దక్షిణామూర్తి అవతారాలు మానవులకు ఆధ్యాత్మ విద్యనందించి ధర్మాన్ని పోషిస్తారు. సద్గురువులందరూ వీరి రూపాలే. వీరు పూర్ణ సిద్ధులుగానే అవతరిస్తారు. అయినా వారు గూడా తాము సద్గురువును సేవించి తరించామని చెప్పి సాధకులకు ఆదర్శమవుతారు. శ్రీ దత్తాత్రేయుడు 24 మంది గురువుల నుండి జ్ఞానమార్జించానని భాగవతంలో చెబుతారు. పుట్టగానే ప్రణవముచ్చరించి, ఉపనయనమవగానే వేదాలు వల్లించిన శ్రీ నృసింహ సరస్వతి స్వామి గూడా - బాల్యంలోనే తల్లికి తన నోట విశ్వరూపం చూపిన శ్రీ కృష్ణునిలాగా - సద్గురువును సేవించారు. వీరు తామే దైవమని, గురువులమనీ చాటుకోరు. భక్తులే వారి అనుభవాలను బట్టి వారిని అలా గుర్తిస్తారు." స్వామి సమక్షంలో ఎన్ని లీలలు జరుగుతున్నా శ్రీ స్వామి గూడా ఏనాడూ తాను భగవంతుడనని చెప్పుకోలేదు. ఏ పండూ తాను పండునని చాటుకోదు; వెలుగు వెలుగునని చాటుకోదు.

ఒకనాటి రాత్రి పోలీసుస్టేషన్ ప్రక్కనుండి వెళ్ళుతున్న స్వామిని చూచి ఎక్కడకు వెళ్ళుతున్నారో అనే కుతూహలం కలిగి ఎస్.ఐ. రామమూర్తి స్వామి వెనుక బయలుదేరాడు. కడపకు తూర్పున వున్న గవర్నమెంటు హై స్కూలు వెనుక వైపు స్వామి వారి శరీరం నుండి తల, దేహము, కాళ్ళు, చేతులు విడివిడిగా గాలిలోకి లేచాయి. స్వామి ఏమి చేస్తున్నారో అని వెనుక వస్తున్న రామమూర్తిగారు భయంతో గుండె చిక్కబెట్టుకొని పోలీసుస్టేషనుకు వెళ్ళిపోయాడు. తర్వాత రోజు స్వామి ఎప్పటిలాగే కనపడ్డారు.

ఒకనాటి తెల్లవారుజామున దీనాసాహెబ్ హోటలు వంటవాడు బషీర్ మలవిసర్జనకై గవర్నమెంటు స్కూలు వెనుకకు వెళ్ళేసరికి అక్కడ స్వామి అవయవాలు విడివిడిగా పడివున్నాయి. స్వామిని ఎవరో దారుణంగా చంపేశారని తలచి భయంతో హోటలులో వున్న దీనా సాహెబ్‌కి వచ్చి చెప్పాడు. ఇద్దరూ కలసి ఆ ప్రదేశానికి వెళ్ళి చూసారు. విషణ్ణ వదనంతో దీనాసాహెబ్ హోటల్ వద్దకి వచ్చి ఈ ఘాతుకం ఎలా జరిగిందో ఆలోచిస్తున్నాడు. ఎటువైపు నుంచి వచ్చారో హోటల్లోని క్యాష్ కౌంటర్ (గల్లాపెట్టె) దగ్గర వున్న టేబుల్ దగ్గర స్వామి నిలబడి కనపడ్డారు. స్వామిని శరీరంతో చూచిన దీనాసాహెబ్ మరింత హడలిపోయాడు. బషీర్ మలవిసర్జన చేసుకుని వచ్చేసరికి హోటల్లో వున్న స్వామిని చూసి దిగ్భ్రమ చెందాడు.

ఒకనాటి తెల్లవారుజామున తలపాకుల రామయ్య (కడప భవనాలు రహదార్లలో అటెండర్) పై అధికారికి కాఫీ తీసుకొని రావటానికి వెళుతూంటే రోడ్డుమీద స్వామివారి కాలొకచోట, తలొకచోట పడిపోయి కనిపించారు భయపడిన రామయ్య మణి హోటల్ దగ్గరకి పరిగెత్తికెళ్ళి, అప్పటికింకా ఆ హోటల్ తెరువనందున అక్కడే నిలబడి వున్నాడు. కొంతసేపటికి అతని ఎదురుగా వున్న పోలీసుస్టేషన్ మెట్లమీద నుండి దిగి వస్తున్న స్వామి కనిపించారు.

ఒకసారి లక్ష్మణయ్యర్ స్వామి ఫోటోలు తీయాలని ఫోటోగ్రాఫర్ చేత తీయిస్తే ప్రతి ఫోటోలోను స్వామి రూపం తప్ప మిగిలినవి అన్నీ వచ్చాయి.

హిందూ పత్రికా విలేఖరి వి.ఆర్. గోపాలకృష్ణ స్వామివారిపై వ్యాసం వ్రాయదలచి దానితోపాటు స్వామి ఫోటో కూడా వేస్తే బాగుంటుందని ఒక

ఫోటోగ్రాఫర్ను తీసుకువెళ్ళి ఫోటోలు తీయిస్తే ఒక్క ఫోటోలో కూడా స్వామి రూపం రాలేదు. తరువాతసారి స్వామి అనుమతితో తీసిన మూడు ఫోటోలలో మాత్రమే స్వామివారి రూపం కనపడింది.

ఒకనాటి అర్ధరాత్రి స్వామి దగ్గర పడుకున్న గుండయ్యకి శ్రావ్యంగా ఒక పాట వినబడటం వలన మెలకువ వచ్చి స్వామివైపుకు తిరిగేసరికి స్వామి వున్నచోట ఒక కాంతిపుంజం కనపడింది. ఆ వెలుగేమిటో చూద్దామని దగ్గరకెళ్ళేసరికి ఆ వెలుగు స్థానంలో స్వామివారు కనపడ్డారు.

పోలు సుబ్బారెడ్డి స్వామివారికి చాలా కాలంగా సేవ చేస్తూ ఎక్కువసేప స్వామితో పాటే వుండేవాడు. ఒకనాడు స్వామి అతనిని పిలిచి అతని ముఖం పార్శ్వముపై తమ అమృత హస్తముతో ముట్టుకున్నారు. సుబ్బారెడ్డికి సమాధిస్థితి ప్రాప్తించింది. ఇలా స్వామి కొన్నిసార్లు సుబ్బారెడ్డికి ఆ స్థితిని ప్రసాదించారు

ఒక వైకుంఠ ఏకాదశినాడు ఉదయగిరి లక్ష్మీ నరసయ్య తాలూకాఫీసులో పడుకుని వున్న స్వామి పాదాలను సేవిస్తూ కూర్చుని వున్నాడు. స్వామి లేచి కూర్చుని రెండు చేతులను నరసయ్య వైపు చాచారు. అప్రయత్నంగా నరసయ తన కుడి చేతిని స్వామి ఎడమ చేతిలో వుంచారు. స్వామి కుడిచేతితో దాని కప్పి వుంచారు. వెంటనే స్వామి నుండి నరసయ్య శరీరములోనికి విద్యుత్త ప్రవహించినట్లయ్యింది. కొంతసేపటి తర్వాత లేచిపోతున్న నరసయ్యన “అట్లాపో” అని తూర్పు వైపుకు చూపించారు. నరసయ్య నడుస్తున్నాడనే కాని అతనికి శరీరమే లేనట్లుగా ఒక దూదిపింజ గాలికి తేలుతూ ముందుకు సాగిపోతున్నట్లుగా వుంది.

ఒకనాటి సాయంత్రం అగ్నిమాపకదళ కార్యాలయ ఉద్యోగి రాముడు మద్యం సేవించి స్వామిని తిడుతూ స్వామి ధోవతిని పట్టుకుని లాగేశాడు. స్వామి మౌనంగా తన దారిన తాను వెళ్ళిపోయారు. ఈ సంఘటన జరిగిన వారం రోజుల లోపలే మరెవరితోనో రాముడు కొట్లాడటం వలన సస్పెండు అయ్యాడు. తరువాత వేరొక ఊరికి బదిలీ అయ్యాడు. ఆ పైన మూడు సంవత్సరాలు దుర్భర జీవితం గడుపుతూ, నికృష్టమైన పరిస్థితిలో మరణించాడు.

ఓం శ్రీ అవధూతేంద్రాయ నమః

శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు

అధ్యాయము - 7

సాధు దూషణ

దీనాసాహెబ్ హోటల్ వంటవాడు మహామునియ్య మద్యపానం సేవించి దారికి అడ్డంగా వున్న స్వామిని కాలితో త్రోసాడు. దీనాసాహెబ్ వంటవానిపై మండిపడ్డాడు. ఇది జరిగిన మూడు రోజులకి స్వామిని ఏ కాలుతో త్రోసాడో ఆ కాలికి వ్రణం లేచి కాలు వాచి లేవలేక దేకవలసిన పరిస్థితి ఏర్పడింది. ఎన్ని మందులు వాడినా వ్రణం తగ్గలేదు. దాదాపు ఒక 6 నెలలు నరకయాతన అనుభవించాడు. స్వామివారిని దూషించినందుకే ఇలా జరిగిందని దీనాసాహెబ్ చెప్పి స్వామివారి పాదములపై పడి శరణు వేడమన్నాడు. ఆ వంటవాడు పశ్చాత్తాపపడి స్వామివారి పాదాలపై పడి శరణు వేడాడు. క్రమక్రమంగా కాలు నయమయ్యింది. ఆ వ్రణం వచ్చిన చోట చిన్న మచ్చ మాత్రం శాశ్వతంగా కాలిపై వుండిపోయింది.

ఇందుకే గాబోలు శ్రీ సాయినాథుడు భిక్షయివ్వకున్నా భిక్షగాళ్ళను తూలనాడవద్దని సెలవిచ్చారు. అలాగే పెద్దవాళ్ళు, 'కాలు జారినా ఫరవాలేదు, నోరు జారితే ప్రమాదం' అన్నారు. దీన్నే గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామివారు "నోరు విప్పకూడదయ్యా" అని చెప్పారు.

ఓం శ్రీ అవధూతేంద్రాయ నమః

శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు

అధ్యాయము - 8

సకల సాధు, దేవతా స్వరూపము

నిర్గుణుడు, నిరాకారుడు అయిన భగవంతుడు సామాన్య మానవుల ఇంద్రియాలకు, మనస్సుకు గోచరించడు. తపోనిష్ఠులైన మహర్షులకు మాత్రమే ధ్యానంలో గోచరిస్తాడు. సామాన్యులను ఉద్ధరించడానికి ఆయనయే పరిపూర్ణులైన మహనీయుల రూపాలలో భూమి మీద లభిస్తుంటాడని భాగవతాది సద్గ్రంధాలు చెపుతున్నాయి. మహనీయుల త రూపాలు వేరైనా వారిలో విరాజిల్లే సద్గురు (దత్తాత్రేయ) తత్వం ఒక్కటే.

దేవతలంటే రూపాలు గాదు. అతీతమైన శక్తి సామర్థ్యాలే. సిరిసంపదలనిచ్చేది లక్ష్మియనీ, విద్యనిచ్చేది సరస్వతియనీ, యిలా దేవతలగూర్చి శాస్త్రాలు చెబుతాయి. తమనాశ్రయించిన భక్తులకు రోగాలు నివారించినందు వలన అవధూతేంద్రస్వామియే ధన్వంతరి. ధనధాన్యాలు ప్రసాదించడం వలన ఆయనయే లక్ష్మీదేవి. అందుకే సద్గురువు సకల సాధు స్వరూపి, సకల దేవతా స్వరూపి.

చూడటానికి సద్గురువు సామాన్య మానవునిలాగే వున్నా ఆయన యొక్క శక్తి సామర్థ్యాలు మాత్రం అపారము. సద్గురు లీలలను చింతన చేస్తే భగవంతుని తత్వంపై మనకు స్థిరమైన భక్తిశ్రద్ధలు కలుగుతాయి. సద్గురువు భక్తులకిష్టమైన మహనీయులతో తాదాత్మ్యము, తానే సకల దేవతా స్వరూపము అనే అనుభవాలిచ్చి తద్వారా ఆయా రూపాలలో వున్న భగవంతుని తత్వంపై విశ్వాసాన్ని మరింత దృఢపరుస్తూ అంతటా వున్న భగవంతుడిని పదే పదే జ్ఞప్తికి తెస్తారు. ఈ అధ్యాయంలో వివిధ భక్తులకు జరిగిన అనుభవాలే దానికి నిదర్శనము.

జ్ఞానిని జ్ఞానే గుర్తించగలడని రమణ మహర్షి వాక్యము. వజ్రము యొక్క విలువ సిసలైన వజ్రాల వర్తకునికే ఎరుక గాని పుచ్చు వంకాయలమ్ముకునే వారికెలా తెలుస్తుంది. అలాగే ఆచార్య శ్రీ భరద్వాజగారు, శ్రీస్వామివారిని దర్శించినది మొదలు తన పరిచయస్థులందరినీ శ్రీస్వామివారిని అవశ్యం (తప్పక) దర్శించమని, వారు భూమిపై ఆవిర్భవించిన దైవస్వరూపమని, వారిని కీర్తించేవారు. ఇదేవిధంగా చాలామంది అవధూతలు వచ్చి శ్రీస్వామివారిని దర్శించి వారి ఆశీస్సులు పొంది వెళ్ళారని శ్రీస్వామివారి భక్తులు చెపుతున్నారు. వారిలో కొందరి

గురించి మాత్రమే ఇక్కడ ప్రస్తావించటం జరిగింది.

అవధూతేంద్రస్వామితో దర్గాస్వామి ఆధ్యాత్మిక మైత్రి

శ్రీ సద్గురు దర్గాస్వామివారి శిష్యులు చాలామంది కడపలో వున్నారు. అది 1960వ సంవత్సరం అక్టోబరు నెల శ్రీ సద్గురు దర్గాస్వామివారు కడప విచ్చేసి కొందరు భక్తులను ఆశీర్వదించి, చేతిలో ఒక ఖర్జూరపు పండును ఉంచుకొని వై.వి.చలం వీధిలో వస్తున్నారు. శ్రీ అవధూతేంద్రులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద గొంతు కూర్చుని ఉన్నారు. ఆ మహనీయుని చూడగానే శ్రీ సద్గురు దర్గాస్వామివారికి ఆయనను పలుకరించవలయునని తలంపు కలిగింది. దగ్గరకు వెళ్ళి చేతనున్న ఖర్జూర ఫలమును స్వామివారికి సమర్పించబోయారు. అవధూతేంద్రులు ఖర్జూరము గ్రహించడానికి అన్నట్లుగా ఎడమ చేయి ముందుకు చాపి తల దక్షిణము వైపు త్రిప్పి "హూ" అన్నారు.

శ్రీ దర్గాస్వామి : ఎడమ చేయి చాపావే! కుడి చేయి పట్టు ఇస్తాను.

అవధూతేంద్రులు : కుడి ఎడమలు ఉన్నాయా?

శ్రీ దర్గాస్వామి : నిన్ను కదిలించేదానికే అలా అడిగాను

అవధూతేంద్రులు లేచారు. చిన్నగా వై.వి.చలం వీధిలోకి వెళ్ళిపోయారు. శ్రీ సద్గురు దర్గాస్వామి ఆయనను అనుసరించారు.

అవధూతేంద్రులు : మళ్ళీ వచ్చావా?

శ్రీ దర్గాస్వామి : నేను నిన్ను వదిలేదానికి రాలేదు.

అవధూతేంద్రులు : ఏమి తీసుకుందామని వెంటాడుతావు? పోతావా లేదా అని హుంకరించారు.

శ్రీ సద్గురు దర్గాస్వామివారు పట్టు వదలక స్వామివారిని అలాగే వెంబడించారు. అవధూతేంద్రులకు భోజనం ఏర్పాటు చేసారు. శ్రీ దర్గాస్వామివారు తర్వాత కొన్ని అరటి పండ్లు కొని అవధూతేంద్రులకు

సమర్పింపబోయారు. ఏమనుకున్నారో ఏమో అవధూతేంద్రులు ఒక్కమారు ఆగ్రహావేశపరులై తన కుడి చేతితో శ్రీ దర్గాస్వామివారి చెక్కిలిపై ఒక చురక అంటించారు. అంతటితో ఆగక తన పవిత్ర పాద పద్మములతో శ్రీ సద్గురు దర్గాస్వామివారిని ఒక్క త్రోపు తోశారు. ఆ త్రోపుకు ఇరువురు స్వాములు క్రింద పడ్డారు.

వీరిద్దరి వింత ప్రవర్తన అక్కడున్న ఎవ్వరికీ బోధపడటం లేదు. ఆ మహనీయులిద్దరికీ ఆ సంఘటన సర్వ సహజముగా వున్నదే కానీ తాము ఏదో ప్రత్యేకంగా ప్రవర్తిస్తున్నామన్న స్ఫురణ కలగటం లేదు. అవధూతేంద్రులు లేచి వై.వి.చలం వీధి వెలుపలకు దారి తీశారు. శ్రీ సద్గురు దర్గాస్వామివారు ఆయనను అనుసరించారు. వీరిరువురు దారి వెంట వెడుతుంటే ఆ వింతను చూడటానికి ఎందరో జనులు ప్రోగయ్యారు. వదలక వారు ఈ స్వాముల వెంట వెళ్ళుతున్నారు. కడపకు దక్షిణంగా అగ్రహారం అనే ఒక చిన్న పల్లె వున్నది. ఆ పల్లెకు దక్షిణంగా "బుగ్గవంక" అనే వాగు సాగుతుంది. అవధూతేంద్రులు, శ్రీ సద్గురు దర్గాస్వామివారు ఆ ప్రదేశం చేరుకున్నారు. అప్పటికి సాయంత్రం అయ్యింది. వారు అంతరంగంలో సంభాషించుకున్నది ఏమిటో తెలియదు కానీ అక్కడికి వెళ్ళాక శ్రీ అవధూతేంద్రులు ప్రసన్నులయ్యారు. పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. శ్రీ అవధూతేంద్రులు శ్రీ దర్గాస్వామి శిరస్సుపై ఆశీర్వాద పూర్వకంగా హస్తముంచారు. వర్ణనాతీతమైన బ్రహ్మానందంలో ఆ యిరువురూ ఓలలాడారు.

పై సంఘటనలు జరిగిన మరుసటి దినము అవధూతేంద్రులు కడప పాతబస్టాండు వద్ద కూర్చుని వున్నారు. అప్పుడు అక్కడికి దర్గాస్వామివారు వచ్చారు. శ్రీ దర్గాస్వామివారు కొన్ని ఇడ్లీలను అవధూతేంద్రులకు సమర్పించారు. శ్రీ అవధూతేంద్రులు వాటిని చేతిలోకి తీసుకుని ఆరగిస్తున్నారు. అంతలో దారిన పోయే ఒక మేక వాటిని ఆశించి వచ్చింది. అవధూతేంద్రులు "ఆ|| పో" అని అదిలించారు. అందుకు శ్రీ దర్గాస్వామివారు "అది కూడా బ్రహ్మమే కదా! దానికిస్తే ఏమి?" అని ప్రశ్నించారు. శ్రీ అవధూతేంద్రులు ఆయనను సూటిగా చూసి "ఆ" అన్నారు. తర్వాత ఇడ్లీ తినలేదు. మిగిలిన ఇడ్లీని శ్రీ సద్గురు దర్గాస్వామివారు, ఆయన బృందం

స్వామివారి ప్రసాదంగా స్వీకరించి ఆరగించారు.

శ్రీ అవధూతేంద్రులకు, శ్రీ సద్గురు స్వామివారికి అవ్యాజమైన అనుబంధమేదో వున్నది. ఒకనాడు శ్రీ అవధూతేంద్రులను శ్రీ దర్గాస్వామివారు అనుసరించారు. స్వామివారు నేరుగా వెళ్ళి బుగ్గవంకలోని మురికి నీటిలోకి దిగారు.

అవధూతేంద్రస్వామి: ఈ మురికి నీటిలోకి నీవు రాగలవా?

మున్సిపాలిటీ కాలువల గుండా బుగ్గవంక చేరుకున్న ఆ మురికి నీరు మహా దుర్గంధ భూయిష్టంగా ఉంటుంది. నల్లనిరంగులో క్రిములకు, మలమాలిన్యాలకు నిలయమై చూపరులకు జుగుప్స కలిగించే విధముగా వుంటుంది.

దర్గాస్వామి: ఊ!

అని అంటూ ఆ నీటిలోకి దిగారు. అంతేగాకుండా **శ్రీ అవధూతేంద్రుల పాదోదకమని భావించుకొని ఆయన పాదముల క్రింద నీటిని చేతిలోనికి తీసికొని తీర్థంగా ఆపోసనం పట్టారు.**

శ్రీ అవధూతేంద్రుల పరీక్ష నెగ్గటం అంత సులువైన పని కాదు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను మాటను అక్షరసత్యంగా భావించారు. ఆయన అసహ్యించుకునే పదార్థమంటూ సృష్టిలో ఏదీ లేదు. అన్నింటా పరమాత్మనే దర్శిస్తూ తన శిష్యునికి కూడా దానినే ఉద్బోధించారాయన. అవధూతేంద్రుల వద్దకు ఎందరో యోగపురుషులు వచ్చి వెళ్ళేవారు.

ఒకప్పుడు నీలకంఠరావుపేట దర్గాల వద్ద ఒక గర్భవతి అయిన ఆమె వచ్చి ఉంటుండేది. ఆమెకు కలగబోయే బిడ్డకు జ్ఞానాన్ని ప్రసాదించి తమ తదనంతరం ఆశ్రమ విషయాలు ఆ బిడ్డకు అప్పగించాలని అమ్మయ్యగారు (శ్రీ దర్గాస్వామి సతీమణి) తలచారు. ఈ సంకల్పంతో అమ్మయ్యగారు ఒక రొట్టెను తయారుచేశారు. **ప్రహ్లాదుడికి గర్భంలో వుండగానే నారాయణ జపం వలన జ్ఞానం కల్గినట్లు, ఆ గర్భవతిచే ఈ రొట్టె తినిపించడం ద్వారా ఆమె కడుపులో ఉన్న బాబుకు జ్ఞానం ప్రసాదించాలని అమ్మయ్యగారు సంకల్పించారు.** ఆ రొట్టె ఆమెకు ఇవ్వాలని దానిని ఒక కవరులో చుట్టి దానిపై ఇంకొక కవరు తొడిగి దానిపై మరలా ఒక కాగితం చుట్టి, బొడ్డులో దోపుకొనే డబ్బు సంచిలో

పెట్టుకున్నారు. ఇదంతా చూస్తూ ఉన్న దర్గాస్వామివారు, నవ్వుతూ ఏమిటి అని అడుగగా అమ్మగారు వివరించారు. అప్పుడు దర్గాస్వామి నవ్వుతూ అలా నీవు అనుకున్నట్టు ఏమీ జరుగదు. దానిని నీ నుండి కడప స్వామి తీసుకుని తింటారు చూడు అన్నారు. కొద్దిసేపటికి కడపలో దిగారు. ఎక్కడనుండి వచ్చారో తెలియదుగానీ దిగిన వెంటనే కడప (అవధూతేంద్రస్వామి) స్వామి వచ్చి దోపుకున్న సంచి పట్టుకుని విడువలేదు. అప్పుడు అమ్మయ్యగారు దర్గాస్వామివారివైపు చూడగా ఆయన పకపకా నవ్వుతూ నీవు ఆ రొట్టెను ఆయనకు ఇవ్వక తప్పదు లేకుంటే ఆయన ఇక్కడ నుండి కదలరు అని చెప్పగా, అమ్మయ్యగారు ఆ రొట్టె కడపస్వామివారికి ఇచ్చేశారు. ఆయన ఆ రొట్టె తిని వెళ్ళిపోయారు. దీని గురించి దర్గాస్వామి చెపుతూ "కడపస్వామి అలా రొట్టెను స్వీకరించి మాకు జ్ఞానాన్ని ప్రసాదించారు" అని అన్నారు.

మనం తినే ఆహారం హృదయపూర్వకమైన నామస్మరణతో తయారు చేస్తే ఆ ఆహారం తిన్నవారికి భక్తిశ్రద్ధలు అబ్బుతాయని, సత్వగుణం వృద్ధియగుతుందన్నది ఒకటవ సందేశం. నామస్మరణతో చేసిన ఆహారమంటే భగవంతునికెంతో ఇష్టము. దానిని ప్రీతితో స్వీకరిస్తారని ఈ లీల తెలుపుతుంది. అలా చేసి అందరమూ తరిద్దాము.

1976లో యం.ఎ. రెండవ సంవత్సరం చదువుతున్న గంగరాజుకి సబ్ ఇన్ స్పెక్టర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది. శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి సలహాననుసరించి సాయి లీలామృత పారాయణ చేసి, నామస్మరణ చేస్తూ ఆశీస్సులకై స్వామి దర్శనానికి వెళ్ళాడు. అంతవరకూ ఎవ్వరినీ దగ్గరకు రానీయకుండా వున్న స్వామి గంగరాజును చూసి ప్రసన్నులవటమేగాక పాదనమస్కారం చేసుకోనిచ్చారు. చుట్టను తీసుకు రమ్మన్నారు. అతను తీసుకు వచ్చిన చుట్టను త్రాగుతూ "పో" అని అన్నారు. గంగరాజు ఇంటర్వ్యూలో ఏ రికమండేషన్ లేకుండా సబ్ ఇన్స్పెక్టరుగా సెలెక్ట్ అయ్యాడు. ఇదంతా పారాయణ చేసిన ఫలితమేనని తెలుస్తోంది.

బ్రహ్మంగారి మఠం వద్ద ధ్యానం చేసుకుంటున్న ఒకతనికి స్వప్నంలో స్వామి కనిపించి కడపకు వచ్చి తనను దర్శనం చేసుకోమన్నారు. ఆ వ్యక్తి స్వామిని దర్శనం చేసుకొని వెళ్ళారు.

స్వామి దర్శనార్థం వచ్చి మహనీయులలో నీలకంఠరావుపేట శ్రీ దర్గాస్వామి, ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారు, గోపాలపురం శ్రీ రామయ్యస్వామి, వడమాలపేట శంకరయ్యస్వామి, సమోసా స్వామి వున్నారు.

ఒకనాటి రాత్రి స్వామివారి భక్తుడు లక్ష్మీ నరసయ్య తాలూకాఫీసు వద్ద స్వామిని దర్శించుకున్నాడు. స్వామివారి నుండి కాంతులు విరజిమ్ముతున్నాయి. ఒక్క క్షణకాలంపాటు జగజ్జనని రాజరాజేశ్వరీదేవి స్వామివారి స్థానంలో దర్శనమిచ్చింది.

ఒకాయన అల్లరిపిల్లలతో చేరి సరిగ్గా చదువుకోని తన పిల్లవాడ్ని స్వామి దగ్గరకు తీసుకువచ్చి పాద నమస్కారం చేయించబోయాడు. పడుకుని వున్న స్వామి కాలితో పిల్లవాడి వక్షస్థలం మీద కొట్టారు. ఆ పిల్లవాడు క్రమంగా చదువు మీద ఏకాగ్రత పెరిగి బాగా చదివేవాడు.

భకరాపేట గ్రామ నివాసి మునెయ్య స్వామిని దర్శిస్తుండేవాడు. స్వామివారి ఆధ్యాత్మికస్థితి యొక్క మహత్తు తెలిసి అలాంటి స్థితి ఎలా కలుగుతుందో చెప్పమని స్వామిని మనస్సులో ప్రార్థిస్తున్నాడు. వెంటనే స్వామి పద్మాసనంలో కూర్చుని చిన్ముద్రను దాల్చారు. స్వామి చేసి చూపించినదే తన ప్రశ్నకు సమాధానంగా తీసుకున్నాడు.

సునంద 2005లో విద్యానగర్లో సాయి మాస్టర్ సమ్మేళనానికి వెళ్ళింది. అక్కడ మాష్టారు దగ్గర చదువుకున్న విద్యార్థులు ఎవరైనా అవధూతేంద్రస్వామి గురించి చెప్పాలనుకున్నది. తను అనుకున్న వ్యక్తులు స్వామి ప్రస్తావన తీసుకురాలేదు. తరువాత మాష్టారు వున్న ఇంటికి (శ్రీ భరద్వాజ తపోవనానికి) వెళ్ళినప్పుడు దానికి ఎదురుగా వుంటున్న మెట్టు శ్రీనివాసరెడ్డిని కలిసారు. ఆయన మేము కడప నుండి వచ్చామని తెలిసి మాష్టారుగారు చెప్పినప్పుడు కడప స్వామిని దర్శించారనీ, స్వామి ఆశీర్వదించినట్లే ఆయనకు కడప కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం వచ్చిందని చాలా విపులంగా చెప్పారు. అది విన్న సునందకు ఎంతో ఆనందం కలిగింది.

పోలు సుబ్బారెడ్డికి ఆధ్యాత్మికత మీద ఎంతో ఇష్టం అందువలన స్వామి సేవ చేసుకుంటుండేవాడు. ఇతని జిజ్ఞాసకు తగినట్లు స్వామి కూడా చిత్రమైన రీతులలో సూచనలిచ్చేవారు. అంతేగాక సుబ్బారెడ్డికి ప్రేరణ పెట్టి ఆచరింపచేసేవారు. ఒకనాడు పశ్చిమ దిశకు నిలబెట్టి ఆ దిశకు దృష్టి నిలుపుకొని ధ్యానం చేయమని సూచించారు. స్వామి చెప్పినట్లు ధ్యానం చేసిన కొద్దిసేపటికే కొన్ని యోజనముల మేర కాంతిపుంజం కనపడేది. ఆ కాంతి చివర ఒక కొండ, ఆ కొండమీద ఒక కోవెల, ఆ కోవెలలో కల్పవృక్షం, కామధేనువు వుండేవి. అలాగే ఒక్కొక్కసారి శ్రీ రాఘవేంద్రస్వామి, షిర్డీ సాయిబాబా ఇంకా అనేక మంది మహనీయుల దర్శనము అయ్యేది. ప్రతిసారీ మహనీయుల దర్శనము అయిన తర్వాత శ్రీ అవధూతేంద్రస్వామి, శ్రీ దత్తాత్రేయులవారు దర్శనమిచ్చేవారు. రూపాలు వేరైనా సద్గురువు ఒక్కడే!

ఓం శ్రీ అవధూతేంద్రాయ నమః

శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు

అధ్యాయము – 9

మహా సమాధి

అగ్నిమాపకదళ సిబ్బంది స్వామివారితో చాలా సన్నిహితంగా ఉండేవారు. స్వామివారు ఒకొక్కసారి వారిని అరుస్తూ తరుముతుండేవారు. స్వామి అరుపులను, తిట్లను ఆశీర్వాదంగా తీసుకొనేవారు. 1977లో ఒకనాడు జాన్ అనే అతనిని స్వామి లాఠీ కర్రతో తరుముతూ రెండు దిమ్మల సందున పడిపోయారు. పడినప్పుడు చెయ్యి విరిగింది. భక్తులు కట్టు కట్టించాలని చూచారు కానీ స్వామి అంగీకరించలేదు. ఆ చేయి దానంతటదే నయమయ్యింది. అన్ని విధాలా ఆరోగ్యంగా ఉన్నారు. 1978లో ఒకనాటి రాత్రి తహసీల్దారుగారి గది ముందర చప్టా పై నడుస్తూ కాలు జారి క్రింద పడి

కాలు విరిగింది. భక్తులందరూ పుత్తూరు రాజుగారు అను శల్య వైద్యులచే స్వామికి కట్టు కట్టించారు. కృష్ణప్ప 'స్వామీ! మీకు ఇలాంటివి జరగటమా?' అని అడిగితే స్వామి "కర్మలేరా! అద్దేపో" అని అన్నారు. పాలెం రెడ్డయ్య స్వామి దర్శనం చేసుకొని మనస్సులో స్వామికి కూడా ఇలా జరగటమా అని అనుకున్నాడో లేదో స్వామి "కర్మరా, కర్మ" అని సమాధానమిచ్చారు.

నడిరోడ్డు మీద పడుకున్న స్వామి తొడ మీద నుండి లారీ వెళ్ళినప్పుడు కూడా ఏమీ అవని స్వామికి, ఖండయోగం అవలీలగా చేయగల స్వామికి చెయ్యి విరగటం, కాలు విరగటం చూస్తుంటే స్వామి మనకు కర్మను హృదయపూర్వకంగా అనుభవించమని చెప్తునట్లు మరియు ఏ భక్తుని కర్మను తీసుకుని అనుభవిస్తున్నారో అనిపిస్తుంది.

వారము రోజులు తీవ్రమైన బాధను స్వామివారు అనుభవించారు. ఆహారము కూడా స్వామివారు సరిగ్గా తీసుకోలేదు. ఇంజక్షను చేయిస్తామంటే "వద్దు బాగౌతుందిలే" అని స్వామి సూది మందు వేయనివ్వలేదు.

ఇంతటి పరిస్థితిలో కూడా స్వామి నిరంతరమూ ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా ఉండేవారు. ప్రక్కవారి మనస్సులోని భావాలకు తగిన విధంగా నడుచుకునేవారు.

గుండయ్యకు పొగాకు వాసన గిట్టదు. ఒకనాడు స్వామికి సపర్యలు చేస్తూ ఉన్న గుండయ్యకు స్వామి పొగాకు చుట్ట వెలిగిస్తారేమోనని అనుమానం కలిగింది. చుట్టలు త్రాగే అలవాటున్న స్వామి గుండయ్య ఇంటికి బయలుదేరి అల్లంత దూరం వెళ్ళాక గాని చుట్టను వెలిగించలేదు.

ఒకనాడు భక్తుల సాయంతో స్వామి మలవిసర్జన చేసి వచ్చిన ప్రదేశాన్ని వెంకట సుబ్బయ్య శుభ్రం చేసి వెళుతూ ఒక లాటరీ టిక్కెట్టు కొన్నాడు. ఆనాటి రాత్రి స్వప్నములో స్వామి కనపడి, నీరు త్రాగి "నీవు తీసుకున్న లాటరీకి 100 రూపాయలు ఇచ్చినా తీసుకో" అని చెప్పారు. అలానే 3 రోజుల తర్వాత అతనికి ఆ లాటరీపై 100 రూపాయల బహుమానం లభించింది. హృదయపూర్వకంగా చేసిన సేవకి స్వామి ఎంతగా కరుణిస్తారో కదా!

కొన్ని రోజుల తర్వాత స్వామి కుంటుతూ వీధులలోకి రావటం

మొదలుపెట్టారు. ఒకనాడు దోసెలు వేసే ఒక చిన్న బంకు వద్ద కూర్చుని దోసెలు తిన్నాక స్వామి పైకి నిలబడలేక ప్రక్కన దుకాణంలో ఉన్న సుబ్బన్నను, శంకరయ్యను పిలిచి వారి సాయంతో లేచి నడుస్తున్నారు. దుకాణం తెరచి వచ్చామే అన్న విషయం సుబ్బన్న మనస్సులోకి రాగానే స్వామి అతనిని వేలితో "నీవు పో" అన్నారు. స్వామివారి సర్వజ్ఞతను చూచి సుబ్బన్న ఆశ్చర్యపడ్డాడు.

స్వామికి ఇంత అస్వస్థతగా ఉన్నా భక్తులు స్వామి దర్శనానికి వస్తూనే ఉన్నారు. స్వామి కూడా ఎవరికి తగినట్లు వారిని అనుగ్రహిస్తూనే ఉన్నారు. కడిమెళ్ళ ఈశ్వరయ్య పసిపాపకు ఎడమ కంటికి పొర వచ్చి దాన్ని తీసి వేయమని ఎందరో డాక్టర్లకు చూపిస్తే దాన్ని ఆపరేషన్ చేసి తీసేయాలని, అది కూడా కర్నూలులో ప్రయత్నించమని చెప్పారు. నెల రోజుల పసిపాపకు శస్త్రచికిత్స చేయటం ప్రమాదకరమని తలచి వైద్యులకు వైద్యుడైన స్వామి దర్శనానికి తీసుకు వచ్చాడు. స్వామి పాప వంక కొంతసేపు చూచి నెమ్మదిగా చేతులలోకి తీసుకున్నారు. స్వామి అమృత స్పర్శ కలిగిన నెలరోజుల లోపల కంటికి ఆవరించిన ఆ పొర ఏ మందులూ వాడకుండా తొలగిపోయింది.

స్వామివారి కంఠంలోని గవద బిళ్ళలు వాచాయి. ఆహారం మానివేసారు. మాటలు హీనస్వరంతో పలికేవారు. 8-4-1978న స్వామిని కడప ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. **10-4-1978న చైత్ర శుద్ధ తదియ, ఉదయం 11 గం॥ 23 ని॥లకు శ్రీ అవధూతేంద్రుల స్వామి మహాసమాధి అయ్యారు.** ఈ విషయం దావానలంగా అందరికీ తెలిసి భక్తులు తండోప తండాలుగా స్వామి దర్శనం చేసుకున్నారు.

గురిమెళ్ళ రామానుజం తన ఇంటిలో కూర్చున్న గది ఒక్కమారుగా చీకటయ్యి గది తలుపులపై "ఇక కొంతసేపటిలో అవధూతస్వామి పరమపదించిన వార్త నీకు తెలుస్తుంది" అని కనపడింది. అంతలోనే వీధిలో స్వామి పరమపదించిన వార్త వినబడింది.

మరుసటిరోజు స్వామి భౌతికకాయాన్ని ఒక జీపుపై వుంచి నగర ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేశారు. నిర్యాణము చెంది ఒకరోజు కావస్తున్నా స్వామి శరీరములో జీవ కళ ఏమాత్రం తగ్గలేదు. జీపులో

స్వామివారి శరీరము ప్రక్కనే నిల్చుని ఊరేగింపులో ఫాల్గొన్న డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డికి స్వామి శరీర స్పర్శ వెచ్చగానే వుండేసరికి ఇంకా కొంత ప్రాణం వున్నదేమో అన్న అనుమానం కలిగింది. స్వామిని ఊరేగింపుగా తీసుకువచ్చి పాతబస్టాండులోని దీనాసాహెబ్ హోటల్ వెనుక వున్న స్థలంలో 11-4-1978న మధ్యాహ్నం 2గం||30ని||లకు సమాధి చేసారు.

సమాధి చేసే సమయంలో దగ్గరలేని దీనాసాహెబ్ ఆలస్యంగా వచ్చి తన హోటల్ వెనుకభాగంలో స్వామిని సమాధి చేయటం చూసి ఎంతో ఆనందపడి స్వామి ఎన్నో సంవత్సరాల ముందరే ఆ స్థలాన్ని నిర్ణయించుకున్నారని సంఘటన తెల్పాడు. కొన్ని సంవత్సరాల క్రితము కొన్ని రోజులపాటు అర్ధరాత్రుళ్ళు హోటల్ వెనుకకు స్వామి వెళ్ళటం గమనించిన దీనాసాహెబ్ ఒకనాటి రాత్రి ఉత్సుకతను ఆపుకోలేక వెళ్ళి చూస్తే స్వామి కాలు మీద కాలు వేసుకొని వెల్లకిలా హాయిగా పడుకున్నారు. ఒక నాగుపాము స్వామికి ప్రదక్షిణ చేసి స్వామి పాదములకు తన పడగ తాకించి వెళ్ళిపోయింది. స్వామిని ఆ పాము ఏమైనా చేస్తుందేమోననే భయంతో చూస్తున్న దీనాసాహెబ్‌ను పిలిచి స్వామి "ఆయన కన్ను నీ మీద పడి వుంటే ఏమై వుండేవాడివి? అదృష్టవంతుడవు" అని ఇంకొన్ని వివరాలు చెప్పారు. స్వామి నిర్ణయించిన స్థలమని తెలియకుండానే ఎక్కువమంది భక్తులు కూడా ఆ స్థలాన్నే నిర్ణయించడంతో స్వామి సర్వజ్ఞుడేగాక, సర్వప్రేరణాధికారుడని కూడా తెలుస్తోంది. సమాధి చేసిన సాయంత్రము షికారుకి బయలుదేరిన తెలుగు పండితుడు నాగముని, సహోపాధ్యాయుడు రామలింగంగారికి సమాధిమీద స్వామి దక్షిణాభిముఖంగా చేతులు మోడ్చి కూర్చొని కనిపించారు. స్వామిని సమాధి చేసారు కదా మరిక్కడ స్వామి వున్నారే అని వారిరువురూ ఆశ్చర్యపడ్డారు.

స్వామివారి సమాధిపై రాతి ఫలకము వుంచారు. 1978 జూన్లో జ్ఞాన మందిర కమిటీ ఏర్పడింది. భక్తులు ఇచ్చిన దక్షిణలతో శ్రీ వారికి మందిరం ఏర్పడింది. తరువాత స్వామివారు సాధారణంగా కూర్చునే భంగిమలో పాలరాతి విగ్రహము ప్రతిష్ఠించబడింది. స్వామివారు విగ్రహ రూపంలో చైతన్యఘనుడై ఎందరో భక్తులకు ఆశ్రయమై భక్తుల సర్వ అభీష్టాలు

నెరవేరుస్తున్నారు.

ఓం శ్రీ అవధూతేంద్రాయ నమః

శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు

అధ్యాయము – 10

మహా నమాధి అనంతరం లీలలు

"సూర్యచంద్రులున్నంతవరకూ ఉండేదే గదయ్యా" అని గొలగమూడి వెంకయ్య స్వామివారు అభయమిచ్చారు. వారిచ్చిన అభయం అక్షరాల నిజమని అవధూతేంద్రస్వామివారి మహా సమాధి అనంతరం జరిగే లీలల ద్వారా కూడా బుజువౌతుంది. రూపాలు వేరైనా సద్గురువు ఒక్కడే.

డబ్ల్యు. రఘునాథ్ (కడప ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్) గారికి కుటుంబ సమస్యలు ఎక్కువై రాత్రుళ్ళు నిద్ర కూడా పట్టేది కాదు. ఒకనాటి రాత్రి నిద్రపట్టక కూర్చున్న రఘునాథ్‌కి ఎదురింటి అరుగు మీద స్వామివారు కూర్చుని దర్శనమిచ్చారు. ఆశ్చర్యంతో స్వామివారి దగ్గరకి వెళ్ళి పాదాలు ముట్టుకుని పాదాభివందనం చేసారు. స్వామి అతనిని ఆశీర్వదిస్తూ "రక్షించాలే పో' అంటూ స్వామి వెళ్ళిపోయారు. ఈ సంఘటన తర్వాత రఘునాథ్ సమస్యలన్నీ తీరిపోయాయి.

గట్టుపల్లి వెంకట సుబ్బయ్య ఒకనాటి రాత్రి భజన చేసి నోరు పుక్కిలించి ఊయుటకై వీధిలోకి వచ్చాడు. ఆయన మనోనేత్రానికి ఎక్కడ చూచినా స్వామివారే కనపడి ఎక్కడ పుక్కిలించి ఊయాలో తెలియక చీకట్లో కనిపించక కట్లపామును త్రొక్కాడు. పాము కాటేసింది. అతనికి ఏమాత్రం భయం, బాధ కలుగలేదు. కుటుంబ సభ్యులు తక్షణమే ఆసుపత్రికి వెళదామంటే అతను సైకిలు మీద బయలుదేరి వెళుతూ ఎదురుగుండా వస్తున్న మరియొక సైకిలును గుద్దాడు. ఆ సైకిలు రాచుకొని బాధ కలిగింది. అంత

బాధలో కూడా మొదట స్వామి సమాధి దర్శనం చేసుకొని తర్వాత ఆసుపత్రికి వెళ్ళాడు. అతనికి పాము కాటు వల్ల ఎటువంటి హాని కలుగలేదు. స్వామి తనకు సైకిలు గుద్దటం వలన కలిగిన బాధతో పాముకాటు నుండి రక్షించారని సుబ్బయ్య నమ్ముతున్నాడు.

ఎమ్. సుబ్బన్న తన కుమార్తె వివాహము జరిపించమని స్వామి సమాధికి మ్రొక్కుకున్నాడు. ఆయన సమాధి దగ్గర వుండగానే అంతకుముందు తప్పిపోయిన ఒక సంబంధము మళ్ళీ కుదిరింది. ఆనందంతో స్వామివారి మ్రొక్కు తీర్చుకున్నాడు.

తలపాకుల రామయ్యగారు అటెండరుగా పనిచేస్తున్న తన అల్లుడికి ప్రమోషన్ రావాలని స్వామివారికి మ్రొక్కుకున్నాడు. అతడికి గుమస్తాగా ప్రమోషన్ వచ్చింది. తన కుమారుడు సర్వీసు కమీషన్ పరీక్షలో పాస్ అవ్వాలని మ్రొక్కుకున్నాడు. అలానే అతను పరీక్షలో ఉత్తీర్ణుడై రహదారులు, భవనాల శాఖలో పనిచేస్తున్నాడు. అమ్మాయి పెండ్లికి చేతిలో నయాపైసా లేదు. స్వామికి మ్రొక్కుకొని ఒక వ్యక్తి వద్దకు వెళ్ళి ఇల్లు తాకట్టు పెట్టుకుని డబ్బు సర్దమని అడిగాడు. అతను సహృదయంతో ఇల్లు తాకట్టు పెట్టుకోకుండానే 14 వేల అప్పు ఇచ్చాడు. స్వామి దయ వలన పెండ్లి సక్రమంగా జరిగింది.

వంద్రంగి రామయ్య స్వామికి మ్రొక్కుకున్న తర్వాత ఎప్పటి నుండో బాధిస్తున్న కీళ్ళనొప్పులు తగ్గాయి. ఏ దేవతకూ మ్రొక్కి ఎరుగని రామయ్య తనకు తెలిసిన వారందరికీ స్వామివారి సేవ చేసుకుంటే అన్ని కష్టాలు తీరుతాయని చెపుతాడు.

ఒక తమిళ వ్యాపారి కడపలో సరుకులు విక్రయించేవాడు. అతని మంచితనాన్ని ఆసరా చేసుకొని కడపలోని వర్తకులు అతనికి రావలసిన పైకమును చెల్లించకుండా ముప్పతిప్పలు పెట్టేవారు. ఆ తమిళ వ్యాపారి ఒకనాడు స్వామి సమాధి దర్శనం చేసుకొని తనకు రావలసిన పైకం వస్తే 101 టెంకాయలు కొడతానని మ్రొక్కుకున్నాడు. చాలా చిత్రంగా ఆనాడే అతని పైకము మొత్తము వసూలైంది.

కొన్నిరోజులుపాటు వీరన్నకి బాగా జ్వరంగా వుంది. ఒకనాటి రాత్రి స్వప్నంలో స్వామి కడప పోలీసు ఉన్నతాధికారి కార్యాలయం నుండి

రైల్వేస్టేషన్ రహదారిని దాటుకొని ముందుకు వెళ్ళి ఒక చోట గొంతుకు కూర్చుని దూరంగా వున్న సమాధిని చూపుతూ “ఇక్కడ ఒక మహనీయుడు మహాసమాధియై వున్నాడు. ఇక్కడ పూజ చేయరా! నీకు జ్వరము పోతుంది” అని చెప్పారు. నిద్ర లేచినా రాత్రి స్వప్నము చాలా స్పష్టముగా వుంది. అంతటి జ్వరములో స్వామి కలలో చూపిన మార్గంలో వెళ్ళి విచారిస్తే చందముని అనే ఒక మహనీయుని సమాధి కనపడింది. ఆ మహనీయుని సమాధికి పూజ చేసి వచ్చాడు. ఆనాటితో వీరన్న జ్వరం తగ్గిపోయింది.

మరునాటి రాత్రి స్వప్నంలో నలుగురు కూర్చుని అరటి ఆకులలో అరటిపండు, కొబ్బరి ముక్కలు, చక్కెర పెట్టుకొని భుజిస్తున్నారు. వాళ్ళు వీరన్నతో "మేము నలుగురముంటే ఒక్కరికే టెంకాయ కొడతావే!” అని అడిగారు. మరునాటి ఉదయం వీరన్న చందముని సమాధి దగ్గర విచారిస్తే మరొక ముగ్గురు మహనీయుల సమాధులు కనిపించాయి. అప్పటినుండి నలుగురు మహనీయుల సమాధులకు పూజ చేస్తుండేవాడు. ఆనాటి నుండి అన్ని విధాల వీరన్నకు కలసి వచ్చింది.

